సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 20.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 013
పేజీలు: 08 వెల: రూ. 5

చైనాలో త్రిశక్తి కూటమి

ఒకే వేదికపై ట్రంప్, పుతిన్, జిన్ పింగ్

- తొలిసారిగా ముగ్గురు అగ్రదేశాల అధినేతల త్రైపాక్షిక భేటీ
- అణ్వాయుధాల తగ్గింపుపై ప్రధానంగా చర్చలు
- తక్షణ ఒప్పందాలు ఉండవని స్పష్టం చేసిన అమెరికా
- ట్రంప్ కు ఘన స్వాగతం పలికిన జిన్ పింగ్


2



సిద్దిపేటలో జెండా ఎగురవేస్తాం

2

హరీశ్‌రావుకు రేవంత్ రెడ్డి సవాల్..

- గెలిపిస్తే సిద్దిపేటకు మంత్రి పదవి ఇస్తా!
- 2029 ఎన్నికలే లక్ష్యంగా సీఎం వ్యూహాత్మక వ్యాఖ్యలు..
- కేసీఆర్ కుటుంబంపై ఆస్తుల ఆరోపణలు
- మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ పేరు
- సిద్దిపేట అభివృద్ధికి రూ.550 కోట్ల కేటాయింపు

ఇండియన్ రోడ్ నెట్‌వర్క్ ప్రపంచంలో నం.1

రోడ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీ: గడ్కరీ

- రోడ్ల అభివృద్ధిలో టెక్నాలజీదే కీలకపాత్ర.. కేంద్ర మంత్రి గడ్కరీ
- రెండేళ్లలో రూ.93 వేల కోట్లతో రోడ్ల నిర్మాణం
- ప్రపంచ విజయవంతమైన మోడల్స్‌ను అధ్యయనం చేశాం


2

క్యూర్, ప్యూర్, రేర్

తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్ 'మూడు రీజియన్ల' మాస్టర్ ప్లాన్!

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా విభజించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కున్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లో తెలంగాణ పాత్ర కూడా కీలకంగా ఉంటుందని ఆయన తెలిపారు. 2034 నాటి కి రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పందేళ్ల పూర్తయ్యే ఎంతో ప్రాధాన్యమున్న 2047 నాటి కి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ప్రధాన టార్గెట్ అని ముఖ్యమంత్రి వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణను 'క్యూ ర్', 'ప్యూర్', 'రేర్' అనే మూడు భాగాలు గా విభజించినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. ఇందులో భాగంగా ఓఆర్ఆర్ (ORR) పరిధిలోని ప్రాంతాన్ని 'క్యూర్'గా పేర్కొంటూ ఇక్కడ సేవా రంగాలకు (సర్వీస్ సెక్టార్) అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు (RRR) వరకు ఉన్న ప్రాంతాన్ని 'ప్యూర్'గా విభజించి, ఇక్కడ తయారీ రంగానికి (మాన్యుఫ్యాక్చరింగ్) పెద్దపీట వేస్తామని తెలిపారు. అలాగే ఆర్ఆర్ఆర్ వెలుపల ఉన్న ప్రాంతాన్ని 'రేర్'గా పరిగణిస్తూ అక్కడ వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ప్రా ధాన్యత ఇస్తామని చెప్పారు.

రాష్ట్రంలో ఆర్ అండ్ బీ శాఖ కేవలం రహదారుల నిర్మాణమే కాకుండా అనేక ఇతర శాఖల పనులను కూడా సమర్థవంతంగా చేపడుతోందని సీఎం తెలిపారు. రహదారులతో పాటు ఇతర మౌలిక సదుపాయా ల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వైద్య రంగంలో భాగంగా రాష్ట్రంలో నిర్మిస్తున్న నూతన ఉస్మాని యా, టిమ్స్ (TIMS), ఇతర ఆసుపత్రులన్నింటిలో కలిపి మొత్తం 8,000 పడకలను (బెడ్స్) ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు.

దేశ భద్రత, జాతి ప్రయోజనాల విషయం లో రాజకీయాలకు ఏమాత్రం తావు లేదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఉండాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి తమ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇప్పటికే వివరించారని, వాటికి అందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఇక రాష్ట్రానికి భారీ గా పెట్టుబడులను ఆకర్షించేందుకు డిసెం బర్ 7, 8, 9 తేదీల్లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. దేశాభివృద్ధిలో, పెట్టుబడుల సాధనలో ఈ సదస్సు ఎంతో కీలకం కానుందని పేర్కొంటూ, ఈ గ్లోబల్ సమ్మి ట్‌కు రావాల్సిందిగా అందరినీ ముఖ్య మంత్రి ఆహ్వానించారు.

- 2034 నాటికి $1 ట్రిలియన్.. 2047కు $3 ట్రిలియన్!
- సేవలు, పరిశ్రమలు, వ్యవసాయం.. మూడు రంగాలపై ఫోకస్!
- ఓఆర్ఆర్ టు ఆర్ఆర్ఆర్.. తెలంగాణ అభివృద్ధికి కొత్త రూట్ మ్యాప్!
- రాష్ట్రానికి పెట్టుబడుల జాతర.. డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్!
- తెలంగాణను దేశ ఆర్థిక శక్తిగా మారుస్తాం.. సీఎం



ఢిల్లీకి పంచాయితీ

తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ..

- ఢిల్లీకి చేరిన రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యల వ్యవహారం
- సీఎంపై వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కలకలం!
- రాజగోపాల్ రెడ్డిపై హైకమాండ్ సీరియస్!
- క్రమశిక్షణ కమిటీ పరిశీలనలో ఎమ్మెల్యే వ్యవహారం!
- మునుగోడు ఎమ్మెల్యేకు తప్పని హైకమాండ్ హెచ్చరిక?
- రాజగోపాల్ రెడ్డి విషయంలో ఢిల్లీ పెద్దలదే తుది నిర్ణయం!


ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణ అధికార కాంగ్రెస్‌లో అసమ్మతి స్వరాలు ఇప్పుడు ఢిల్లీ స్థాయికి చేరాయి. సొంత ప్రభుత్వంపైనే తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్న ఎమ్మెల్యేల వ్యవహారం హస్తిన పెద్దలకు తలనొప్పిగా మారింది. ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన ఘాటు వ్యాఖ్యలు కాంగ్రెస్ అధిష్టానంలో కలకలం రేపుతున్నాయి. మరోవైపు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సైతం ప్రభుత్వ పనితీరు, నిధుల కేటాయింపులపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో పార్టీలో ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది.

రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను అధిష్టానం తీవ్రంగా పరిగణించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మునుగోడు వేదికగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఆయన చేసిన విమర్శలపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పెద్దలు టీపీసీసీ నాయకత్వాన్ని ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఆయన ప్రసంగానికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లతో పాటు వ్యాఖ్యల తెలుగు, ఆంగ్ల అనువాద సారాంశాన్ని కూడా రాష్ట్ర నాయకత్వం హైకమాండ్‌కు పంపినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ.. రాజగోపాల్ రెడ్డి అంశం ప్రస్తుతం అధిష్టానం పరిశీలనలో ఉందని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ బహిరంగ విమర్శలు చేసే వారిపై క్రమశిక్షణా కమిటీ దృష్టి సారించిందని తెలిపారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌తో చర్చించిన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటామని సంకేతాలిచ్చారు.

షోకాజ్‌తో సరిపెడతారా..

ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రధానంగా వినిపిస్తున్నప్రశ్న ఇదే. ముఖ్యమంత్రిపై బహిరంగంగా తీవ్ర విమర్శలు చేసిన రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే పార్టీలో క్రమశిక్షణకు విలువ లేకుండా పోతుందని కొందరు సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయడం లేదా తాత్కాలిక సస్పెన్షన్ విధించడం వంటి చర్యలు ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే మరో వాదన కూడా బలంగానే వినిపిస్తోంది. రాజగోపాల్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేస్తే రాజకీయంగా కొత్త మిగతా 02లో



టాక్స్ తగ్గించాం.. జీతాలు పెంచారా?

పారిశ్రామికవేత్తలకు ప్రధాని సూటి ప్రశ్న


2


- ఫిక్కీ సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలను ప్రశ్నించిన మోదీ
- ఎన్ని ఉద్యోగాలు సృష్టించారో చూపాలని సూచన
- దేశీ వినియోగదారులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యత ఇవ్వాలి

రూ.7.5 లక్షల కోట్ల పెళ్లిళ్ల పండగ

- పెళ్లిళ్ల సీజన్‌లో భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త బోష్!
- నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు 52 లక్షల వివాహాలు


2

ఇదీ AI ముద్ర



ఏపీలో మూడు ఎకనమిక్ రీజియన్ల ప్రణాళికలు సిద్ధం

రూ.4.6 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా చంద్రబాబు సమీక్ష

- విశాఖ, తిరుపతి, అమరావతి రీజియన్ల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఫోకస్
- అమరావతి ప్రాంతంలో 48 ప్రాజెక్టుల ద్వారా రూ.4.65 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో 167 పనుల ప్రణాళిక.. 64 పనులు ఇప్పటికే ప్రారంభం
- విశాఖ ఐటీ రంగం ద్వారా 2 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ


2

ఏపీ యత్నాలను అడ్డుకుంటాం

నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

- జలవాటాలో ఒక్క చుక్కా వదులుకోం..
- కేఆర్ఎంబీ, కేంద్రానికి ఫిర్యాదులు
- యాసంగి వరి సాగు వద్దని సూచన


2

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 20 నవంబర్, 2026

జీర్ణక్రియకు గోరువెచ్చని నీరు

ఆయుర్వేదం ప్రకారం గోరువెచ్చని నీరు జీర్ణక్రియకు అనుకూలంగా ఉంటుంది. భోజనం తర్వాత కడుపు ఉబ్బరం, జీర్ణ సంబంధిత అసౌకర్యాలు ఉన్నవారికి వెచ్చని నీరు కొంత ఉపశమనం కలిగించవచ్చు.



ఢిల్లీకి చేరిన పంచాయితీ

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధిష్టానం భావించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆయన పార్టీని వీడితే మునుగోడులో మరో ఉపఎన్నిక అనివార్యమయ్యే పరిస్థితి రావచ్చు. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీల నుంచి ప్రభుత్వానికి రాజకీయ సవాళ్లు ఎదురవుతున్న సమయంలో మరో ఉపఎన్నికను ఎదుర్కోవడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారవచ్చు. దీనికి తోడు ఆయన సోదరుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి సమయంలో రాజగోపాల్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకుంటే పార్టీలో కుటుంబపరమైన, అంతర్గత రాజకీయ సమీకరణాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.

ఢిల్లీ పెద్దల నిర్ణయంపైనే చూపు!

ఒకవైపు పార్టీ క్రమశిక్షణ.. మరోవైపు రాజకీయ పరిణామాలపై ఆందోళన.. ఈ రెండింటి మధ్య కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే వీడియో క్లిప్పింగ్‌లు ఢిల్లీకి చేరడంతో హైకమాండ్ పరిశీలన తర్వాతే తదుపరి అడుగు పడే అవకాశం కనిపిస్తోంది. హెచ్చరికలతో రాజగోపాల్ రెడ్డిని దారిలోకి తెస్తారా? షోకాజ్ నోటీసుతో కట్టడి చేస్తారా? లేక సస్పెన్షన్ అస్త్రాన్ని బయటకు తీస్తారా? అన్నది వేచి చూడాలి. ఏదేమైనా ఈ వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలకు అద్దం పడుతుండగా, హైకమాండ్ తీసుకునే నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీయవచ్చు.

రూ.7.5 లక్షల కోట్ల 'పెళ్లిళ్ల' పండగ



ముద్ర, న్యూఢిల్లీ :

భారతదేశంలో మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్ దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊపును తీసుకురానుంది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు కేవలం 25 రోజుల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా సుమారు 52 లక్షల వివాహాలు జరగనున్నాయని అంచనా. వీటి ద్వారా ఏకంగా రూ.7.5 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు నమోదవుతాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అంచనా వేసింది. ఈ ముహూర్తాల సీజన్.. రిటైల్, తయారీ, ఆతిథ్యం, రవాణా రంగాలకు అతి పెద్ద చోదక శక్తిగా మారనుందని వ్యాపారుల సమాఖ్య వెల్లడించింది.

పెళ్లిళ్ల కేవలం శుభకార్యాలుగానే కాకుండా వ్యాపారులు, తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, చేతివృత్తుల కళాకారులు, సేవా రంగాలకు అండగా నిలిచే భారీ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందాయని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ స్పష్టం చేశారు. ఒక్క ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలోనే దాదాపు 5 లక్షల వివాహాలు జరగనుండగా, అక్కడ ఏకంగా రూ.2.5 లక్షల కోట్ల మేర వ్యాపారం సాగుతుందని అంచనా వేశారు. ఈ మొత్తం రూ.7.5 లక్షల కోట్ల ఖర్చులో సుమారు రూ.4 లక్షల కోట్లు (54 శాతం) వస్తువులు, రిటైల్ కొనుగోళ్ల ద్వారా సమకూరనుండగా.. సర్వీసుల రంగం రూ.3.45 లక్షల కోట్ల వాటాను దక్కించుకోనుంది.

వినియోగ వ్యయంలో సింహభాగం ఆభరణాలు, దుస్తులదే కానుంది. బంగారం, వజ్రాభరణాల కొనుగోళ్లు రూ.1.2 లక్షల కోట్లకు చేరనుండగా, వస్త్రశ్రేణి రూ.90,000 కోట్ల వాటాతో తర్వాతి స్థానంలో నిలిచింది. గిఫ్ట్‌లు, ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్, స్వీట్లు కూడా భారీగా అమ్ముడుపోనున్నాయి. సేవల విభాగంలో క్యాటరింగ్ రంగానికి రూ.75,000 కోట్లు, కల్యాణ మండపాలు, బాంక్వెట్ హాళ్లు, హోటళ్లకు మరో రూ.60,000 కోట్ల వ్యాపారం సమకూరనుంది. గత కొన్నేళ్లుగా వివాహ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తోంది. 2022లో రూ.3.75 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిమాణం ఏటేటా పెరుగుతూ ఈ ఏడాది రూ.7.50 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరింది. అంతే కాకుండా, ఈ సీజన్ ద్వారా దాదాపు 1.25 కోట్ల మందికి తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఏపీ యత్నాలను అడ్డుకుంటాం

ముద్ర, హైదరాబాద్ :

కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏ పోరాటానికైనా, త్యాగానికైనా సిద్ధమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లాలో మాట్లాడిన ఆయన.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1.8 టీఎంసీల నీటిని తరలించుకుపోయేందుకు ప్రయత్నిస్తున్న మాట వాస్తవమేనని, కానీ ఒక్క చుక్క నీటిని కూడా తీసుకెళ్లని వ్యబోమని తేల్చి చెప్పారు.

కేఆర్ఎంబీ, కేంద్రానికి ఫిర్యాదులు

ఆంధ్రప్రదేశ్ జలదోపిడి యత్నాలను అడ్డుకునేందుకు ఇప్పటికే కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)తో పాటు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు మంత్రి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం పూర్తిస్థాయిలో పోరాడుతున్నామని, ఒక్క చుక్క జలాన్ని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాను సమర్థవంతంగా వినియోగించుకోగలుగుతున్నామని పేర్కొన్నారు.

తాగునీటి నిల్వలకే ప్రాధాన్యం

ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి వినియోగంపై రైతులకు, ప్రజలకు ఉత్తమ్ కీలక సూచనలు చేశారు. ఎల్ నినో కారణంగా యాసంగి సీజన్‌లో వరి సాగు వద్దని సూచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే రిజర్వాయర్లలో నీటిని నిల్వ ఉంచుతున్నామని స్పష్టం చేశారు.

సైనికుడి నిబద్ధతతోనే పనిచేస్తున్నా

గతంలో చైనా సరిహద్దులో సైనికుడిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి.. సరిహద్దులో దేశం కోసం ఎలా పనిచేశానో, ఇప్పుడూ అదే నిబద్ధత, అంకితభావంతో పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని అన్నారు. ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు.



సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం





ముద్ర, మెదక్ :

తెలంగాణ రాజకీయాల్లో కీలక నియోజకవర్గంగా గుర్తింపు పొందిన సిద్దిపేటపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. 2029 ఎన్నికల్లో తెలంగాణతో పాటు సిద్దిపేట గడ్డపై కూడా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఆ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. తద్వారా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రాజకీయంగా సవాల్ విసిరారు. సిద్దిపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. సిద్దిపేట అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం రూ.550 కోట్ల నిధులు కేటాయించిందని వెల్లడించారు. ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా రాజకీయ వ్యాఖ్యలు చేశారు.

గెలిపించే బాధ్యత మీదే.. మంత్రి పదవి నాది!

సిద్దిపేట గడ్డపై కాంగ్రెస్ కార్యకర్తలు తమ బలాన్ని నిరూపించారని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కోరుకున్న నాయకుడికే కాంగ్రెస్ టికెట్ ఇస్తామని, ఆ అభ్యర్థిని గెలిపించే బాధ్యత కార్యకర్తలు, ప్రజలదేనని పేర్కొన్నారు. సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే మంత్రి పదవి ఇచ్చే బాధ్యత తనదేనని ప్రకటించారు. 2004లో వార్డు మెంబర్‌గా కూడా గెలవని హరీశ్‌రావు.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సహకారంతో మంత్రి అయ్యారని సీఎం వ్యాఖ్యానించారు. మంత్రి అయిన తర్వాత సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ లేకుండా చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఇప్పుడు అదే గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

కేసీఆర్ కుటుంబంపై ఆస్తుల ఆరోపణలు

సభలో హరీశ్‌రావుతో పాటు కేసీఆర్, కేటీఆర్ కుటుంబాలపై కూడా రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, కేసీఆర్ కుటుంబం మాత్రం వేల కోట్ల ఆస్తులు సంపాదించిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి కుటుంబ పరిస్థితిని ప్రస్తావిస్తూ హరీశ్‌రావు కుటుంబ ఆస్తులపై ప్రశ్నలు లేవనెత్తారు. రంగనాయక్ సాగర్, జన్వాడ, కొండపోచమ్మ ప్రాంతాల్లో ఫామ్‌హౌస్‌ల అంశాన్ని ప్రస్తావించారు. ఉద్యమంలో త్యాగాలు చేసిన కుటుంబాలకు దక్కిన గుర్తింపు ఏమిటని ప్రశ్నించారు.

హరీశ్‌కు రెండోసారి మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదు?

బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనపై కూడా సీఎం విమర్శలు చేశారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో రూ.20 లక్షల కోట్లు సమకూరాయని, ప్రాజెక్టుల పేరుతో మరో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. ప్రాజెక్టుల్లో అవకతవకలకు పాల్పడినందుకే 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌రావుకు మంత్రి పదవి ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, దాని నాణ్యతపై కూడా విమర్శలు చేశారు.

కృష్ణా జలాలపై కేసీఆర్‌ను నిలదీసిన సీఎం

తెలంగాణ ప్రయోజనాలకు అన్యాయం చేస్తున్నామన్న విమర్శలను రేవంత్ రెడ్డి తిప్పికొట్టారు. టీడీపీతో తనకు ఎప్పుడో సంబంధాలు తెగిపోయాయని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకు అంగీకరిస్తూ సంతకం చేసింది కేసీఆర్, హరీశ్‌రావు కాదా అని ప్రశ్నించారు. అప్పటి ఏపీ సీఎం జగన్‌ను ప్రగతి భవన్‌కు ఆహ్వానించి రాయలసీమ ప్రాజెక్టుకు సహకరించారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ పేరు

రాజకీయ విమర్శలతో పాటు సిద్దిపేట చరిత్రను కూడా సీఎం ప్రస్తావించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మదన్ మోహన్ సేవలను గుర్తుచేశారు. 1983లో సిద్దిపేట నుంచి కేసీఆర్‌ను మదన్ మోహన్ ఓడించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆయన సేవలకు గుర్తింపుగా సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ పేరు పెట్టాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన పేరును కనుమరుగయ్యేలా కేసీఆర్, హరీశ్‌రావు ప్రయత్నించారని ఆరోపించారు. మొత్తంగా సిద్దిపేట సభ ద్వారా రేవంత్ రెడ్డి రెండు స్పష్టమైన రాజకీయ సంకేతాలు ఇచ్చారు. ఒకవైపు రూ.550 కోట్ల అభివృద్ధి పనులతో పట్టణంపై ప్రభుత్వ దృష్టిని చాటగా, మరోవైపు 2029 ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యమని ప్రకటించారు. గెలిచిన వారికి మంత్రి పదవి ఇస్తానన్న హామీతో సిద్దిపేట రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపారు.

టాక్స్ తగ్గించాం.. జీతాలు పెంచారా?

ముద్ర, హైదరాబాద్ :

కార్పొరేట్ పన్నుల తగ్గింపు, పలు ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో పరిశ్రమలు ఎంత మందికి కొత్తగా ఉపాధి కల్పించాయి? ఉద్యోగుల వేతనాలను ఎంత మేర పెంచాయి? అంటూ భారత పారిశ్రామిక రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సూటిగా ప్రశ్నించారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పన్నుల తగ్గింపు, నిబంధనల సరళీకరణ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వంటి ఎన్నో చర్యలు తీసుకుందని ప్రధాని గుర్తుచేశారు. ఆ ఫలాలను ఉద్యోగాల సృష్టి, మెరుగైన వేతనాల రూపంలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత పరిశ్రమలపైనే ఉందని స్పష్టం చేశారు.

దేశ సర్వతోముఖాభివృద్ధి కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, పారిశ్రామికవేత్తలు సైతం ఈ ప్రగతి ప్రయాణంలో సమాన భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంస్థలే సొంతంగా నిర్దిష్ట వ్యూహాలను రూపొందించుకోవాలని సూచించారు. ప్రతిదానికీ ప్రభుత్వంపైనే ఆధారపడవద్దని హితవు పలికారు. విదేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులకే అత్యున్నత నాణ్యతను కేటాయిస్తూ 'ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ' పేరిట ప్రచారం చేయడంపై మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ వినియోగదారులకు అందించే నాణ్యమైన వస్తువులనే భారతీయ పౌరులు కూడా పొందే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. దేశీయ మార్కెట్‌ను తేలిగ్గా తీసుకోవద్దని హితవు పలికారు.

దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ప్రపంచానికే ఫార్మసీ హబ్‌గా పేరుగాంచిన భారత్.. కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ), ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై బిలియన్ల డాలర్లు వెచ్చించాల్సి రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమృద్ధిగా ముడి వనరులు ఉన్నప్పటికీ అల్యూమినియం, స్టీల్ రంగాల్లో ప్రత్యేక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం తగదన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో భారత ఎగుమతుల వాటా కేవలం 2 నుంచి 2.5 శాతానికే పరిమితం కావడంపై దృష్టి సారించాలని, గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు.

ఏపీలో 3 ఎకనమిక్ రీజియన్ల ప్రణాళికలు సిద్ధం

ముద్ర, అమరావతి :

రాష్ట్ర సమగ్ర ఆర్థిక పురోగతికి ఊతమిచ్చేలా విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్ల అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మూడు రీజియన్లలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల పురోగతి, పరిశ్రమల గ్రౌండింగ్ తదితర అంశాలపై అధికారులు సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రాంతాలవారీగా ప్రత్యేక వనరులను ఆధారంగా చేసుకొని పెట్టుబడులను ఆకర్షించడం, భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ఎజెండాగా ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం రూపొందించింది.

ఉత్తరాంధ్ర కేంద్రంగా ఉన్న విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) పరిధిలో పోర్టులు, ఐటీ, డేటా సెంటర్లు, భారీ పరిశ్రమలకు పెద్దపీట వేస్తున్నారు. ఇక్కడ ప్రతిపాదించిన 167 ప్రాజెక్టుల్లో ఇప్పటికే 64 పనులను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రాంతానికి 'వైజాగ్ బే సిటీ' యాంకర్ ప్రాజెక్టుగా నిలవనుండగా.. మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురంలో ఐటీ, డేటా సెంటర్ హబ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. మరో 15 నుంచి 20 నూతన ఐటీ సంస్థలను విశాఖకు రప్పించడంతో పాటు, ఐటీ రంగంలో 2 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించారు. దీనితో పాటు స్టీల్ సిటీ, కాకినాడ ఇండస్ట్రియల్ సిటీ, పోర్టుల విస్తరణ, కోనసీమ బ్యాక్ వాటర్స్ అభివృద్ధి, అరకు, మారేడుమిల్లిలో ఎకో టూరిజం ప్రాజెక్టులపై దృష్టి సారించారు.

రాయలసీమను సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ రంగాలుగా తీర్చిదిద్దుతూ తిరుపతి ఎకనమిక్ రీజియన్ (టీఈఆర్) ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని 87 గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో 66 ప్రాజెక్టులు ఈ రీజియన్ పరిధిలోనే ఏర్పాటు కానుండటం విశేషం. స్పేస్, ఎయిర్ క్రాఫ్ట్, డిఫెన్స్, ఈవీ పరిశ్రమలతో పాటు హార్టికల్చర్ హబ్‌లో భాగంగా డెయిరీ, పౌల్ట్రీ, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ క్లస్టర్లు రానున్నాయి. ఈ రీజియన్‌లోని 14 పట్టణాలను వివిధ రంగాల పారిశ్రామిక నగరాలుగా మార్చనున్నారు.


మరోవైపు అమరావతి రీజియన్‌లో క్వాంటం టెక్నాలజీ, ఐటీ, లాజిస్టిక్స్, అగ్రి వాల్యూ చైన్ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇక్కడ 48 భారీ ప్రాజెక్టుల ద్వారా ఏకంగా రూ.4.65 లక్షల కోట్ల పెట్టుబడులను గ్రౌండింగ్ చేసేలా ప్రణాళికలు ఖరారు చేశారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పనులను వేగవంతం చేసి ఎగుమతులకు ఊతమివ్వడంతో పాటు సూర్యలంక, ఓడరేవు, రామాపురం, నిజాంపట్నం, డిండి తీర ప్రాంతాలను కోస్టల్ టూరిజం హబ్‌లుగా అభివృద్ధి చేయనున్నారు.

చైనాలో త్రిశక్తి కూటమి



ముద్ర, న్యూఢిల్లీ :

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒకే వేదికపైకి రాబోతున్నారన్న ప్రతిపాదన అంతర్జాతీయంగా ఆసక్తి రేపుతోంది. చైనాలోని షెన్‌జెన్‌లో APEC సదస్సు నేపథ్యంలో జరగనున్న ఈ భేటీలో అణ్వాయుధ నియంత్రణ, ఇరాన్ పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించే అవకాశముంది. అమెరికా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని, చైనా ప్రపంచ శక్తిగా గుర్తింపు పొందాలని, రష్యా అంతర్జాతీయంగా తన ప్రాధాన్యాన్ని చాటుకోవాలని భావిస్తున్నాయి. అయితే ఈ ముగ్గురి మధ్య వ్యూహాత్మక ఏకాభిప్రాయం సాధ్యమా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిణామంపై భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాజీ విదేశాంగ కార్యదర్శి కన్వల్ సిబల్ అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం ప్రపంచాన్ని త్రిధ్రువ వ్యవస్థ వైపు నడిపిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



చిన్నగా ఉన్నా మా సీఎమ్మే..

నూకేయకండి!

రేవంత్‌ను టార్గెట్ చేస్తూ కేటీఆర్ సెటైర్లు..

ఈఎంఐ సీఎం అంటూ ఘాటు విమర్శలు
మూడేళ్ల కాంగ్రెస్ పాలనపై ఫైర్, రైతులను మోసం చేసిన కాంగ్రెస్
కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్న ప్రజలు

ముద్ర, హైదరాబాద్ :

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'చిన్నగా ఉన్నా ఆయన మా ముఖ్యమంత్రి.. నూకేయకండి' అంటూ రేవంత్ రెడ్డి శారీరక ఎత్తును ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అంతేకాకుండా రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, ఈఎంఐ కడితేనే పదవి రెన్యువల్ అవుతుందని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యూరియా, కరెంట్, రైతులకు అవసరమైన సంచులు కూడా అందుబాటులో లేవని, రైతుబంధు, రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు.

మరో పది రోజుల్లో కాంగ్రెస్ పాలనకు మూడేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. భూపాలపల్లిని మున్సిపాలిటీగా మార్చి, జయశంకర్ పేరు మీద జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను నిర్మించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. మొత్తంగా కేటీఆర్ వ్యాఖ్యలు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వేడిని మరోసారి పెంచాయి.

ఇండియన్ రోడ్ నెట్‌వర్క్ ప్రపంచంలోనే నంబర్‌వన్

ముద్ర, హైదరాబాద్:

ఇండియన్ రోడ్ నెట్‌వర్క్ ప్రపంచంలోనే నంబర్‌వన్ అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. ఇండియన్ రోడ్ నెట్‌వర్క్ ప్రపంచంలోనే నంబర్‌వన్ స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి టెక్నాలజీ ఎంతో అవసరమని తెలిపారు. టెక్నాలజీని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోని విజయవంతమైన మోడల్స్ అధ్యయనం చేయాల్సి వచ్చిందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాన్ని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రోడ్ల అభివృద్ధిలో కొత్త టెక్నాలజీపై ఇరువురు నేతలు చర్చించారు. రెండేళ్లలో రూ.93 వేల కోట్లతో రోడ్ల నిర్మాణమే టార్గెట్‌గా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 20.11.2026
www.mudranews.in | @mudranews

చల్లటి నీటితో స్నానం ఎప్పుడు మంచిది?

చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. శరీరంలోని వేడిని తగ్గించడంలో సహాయపడుతుందని ఆయుర్వేదం చెబుతుంది. అయితే చలికాలంలో మరీ చల్లటి నీటితో స్నానం చేయకుండా జాగ్రత్తపడాలి.



అగ్నిమాపక, ఎస్పీఎఫ్ డీజీగా వీసీ సజ్జనర్ బాధ్యతల స్వీకరణ



ముద్ర, హైదరాబాద్: తెలంగాణ అగ్నిమాపక శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డైరెక్టర్ జనరల్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నానక్ రాంగూడలోని అగ్నిమాపక శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడంతోపాటు సహాయక చర్యల్లో స్పందన సమయాన్ని తగ్గిస్తామని తెలిపారు. బహుళ అంతస్తుల భవనాలు, ఆసుపత్రులు, పరిశ్రమల్లో అగ్నిమాపక భద్రతా నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీఎఫ్ భద్రతను మరింత పటిష్టం చేస్తామని, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణ కోసం 'గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్' నిర్వహిస్తామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 101 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ట్రక్ పార్కింగ్ భూముల వేలాన్ని తక్షణమే రద్దు చేయాలి

హరీష్ రావు



ముద్ర, హైదరాబాద్ : కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ భూముల అమ్మకాన్ని తక్షణమే నిలిపివేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర ప్రభుత్వ భూముల విక్రయాలపై తీవ్ర విమర్శలు చేశారు. కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ భూమి ప్రజా అవసరాల కోసం సేకరించిందని, దానిని ఇతర అవసరాలకు వినియోగించడం చట్టవిరుద్ధమని హరీష్ రావు ఆరోపించారు. వేలం రద్దు చేయకుంటే ఆందోళనల్లో బీఆర్ఎస్ ప్రత్యక్షంగా పాల్గొంటుందని ప్రకటించారు.

డ్రగ్స్ మహమ్మారిపై సమరశంఖం..

'నషా ముక్త్ భారత్ యాత్ర'కు నాగార్జున మద్దతు
హైదరాబాద్ వాక్‌లో పాల్గొనాలని అక్కినేని నాగార్జునకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆహ్వానం
యాత్ర టీ-షర్టులను ఆవిష్కరించిన నాగార్జున, కిషన్ రెడ్డి



ముద్ర, హైదరాబాద్ : యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో చేపడుతున్న 'నషా ముక్త్ భారత్ యాత్ర'కు ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున తన మద్దతు ప్రకటించారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈ యాత్రలో భాగస్వాములు కావాలని నాగార్జునను కిషన్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగార్జున, కిషన్ రెడ్డితో కలిసి యాత్రకు సంబంధించిన టీ-షర్టులను ఆవిష్కరించారు. డ్రగ్స్ వినియోగం సమాజాన్ని, ముఖ్యంగా యువత జీవితాలను దెబ్బతీస్తోందని, మత్తుపదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నాగార్జున పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన, మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం చేపట్టే కార్యక్రమాలకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' పిలుపు మేరకు ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశాన్ని నిర్మించాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భావితరాల భద్రత, యువత ఉజ్వల భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్న ఈ ప్రజా ఉద్యమంలో యువత, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

వసుధైవ కుటుంబకం స్ఫూర్తితో ముందుకు సాగాలి

- గవర్నర్



ముద్ర, హైదరాబాద్: యువతలో నాయకత్వ లక్షణాలు, అంతర్జాతీయ అవగాహన, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడంలో ఐఐఎంయూఎన్ వంటి వేదికలు కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం కుంట్లూర్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో నిర్వహించిన ఐఐఎంయూఎన్ హైదరాబాద్ చాప్టర్–2026 కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వాతావరణ మార్పులు, సాంకేతిక పరిణామాలు, అంతర్జాతీయ శాంతి వంటి ప్రపంచ సవాళ్ల పరిష్కారంలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావంతోనే నిజమైన నాయకత్వం అలవడుతుందని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, మాదకద్రవ్యాలు, దురలవాట్లకు దూరంగా ఉంటూ దేశాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాకు రూ.544 కోట్ల అభివృద్ధి పనులు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. మరికొన్నింటిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



ముద్ర, సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలో అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. జిల్లాలో మొత్తం రూ.544.11 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా విద్య, రెవెన్యూ, విద్యుత్, మహిళా సంక్షేమ రంగాలకు సంబంధించిన పలు పనులకు శ్రీకారం చుట్టారు. దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఒక్కోచోట రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.15.44 కోట్లతో అదనపు తరగతి గదులు, రూ.13.50 కోట్లతో ఆరు తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులకు ప్రారంభం పలికారు. చిన్నకోడూరు మండలంలో రూ.7.50 కోట్లు, దౌల్తాబాద్ మండలంలో రూ.7.80 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జనగామ నియోజకవర్గంలో రూ.6.89 కోట్లతో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు.

అలాగే జిల్లాలో రూ.54.67 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ సబ్‌స్టేషన్లను సీఎం ప్రారంభించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రూ.14.35 కోట్లతో నిర్మించిన వసతి సత్రం, రూ.12 కోట్లతో నిర్మించిన క్యూ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.6.50 కోట్లతో నిర్మించిన 53 గ్రామ మహిళా సంఘాల భవనాలను, రాయపోల్ మండలంలో రూ.3.87 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని ప్రారంభించారు. గజ్వేల్‌లో రూ.1.59 కోట్లతో నిర్మించిన విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనులతో జిల్లాలో విద్యా సదుపాయాలు మెరుగుపడటంతో పాటు విద్యుత్, పరిపాలన, మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి.

తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి (TGBIE) 2027 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తాత్కాలిక టైమ్‌టేబుల్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు సంబంధించిన థియరీ పరీక్షలతో పాటు ప్రాక్టికల్స్, ఇంటర్నల్ అసెస్‌మెంట్, ఇతర పరీక్షల తేదీలను బోర్డు ప్రకటించింది. 2027 ఫిబ్రవరి 24 నుండి మార్చి 20 వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 24న ప్రారంభమై మార్చి 19న ముగుస్తాయి. సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25న మొదలై మార్చి 20న పూర్తవుతాయి. ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు థియరీ పరీక్షలు నిర్వహిస్తారు. జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఈ షెడ్యూల్ వర్తిస్తుండగా, ఒకేషనల్ సబ్జెక్టుల వారీ టైమ్‌టేబుల్‌ను వేరుగా విడుదల చేస్తామని బోర్డు తెలిపింది. థియరీ పరీక్షలకు ముందే ప్రాక్టికల్ పరీక్షలను పూర్తి చేసేలా బోర్డు తేదీలను ఖరారు చేసింది. సెకండియర్ ప్రాక్టికల్స్‌ను 2027 ఫిబ్రవరి 1 నుండి ఫిబ్రవరి 10 వరకు, ఫస్టియర్ సైన్స్ ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 10/11 నుండి ఫిబ్రవరి 18 వరకు నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలను ఫస్టియర్ విద్యార్థులకు జనవరి 29న, సెకండియర్ విద్యార్థులకు జనవరి 30న నిర్వహిస్తారు. ఫస్టియర్ ఇంటర్నల్ అసెస్‌మెంట్‌ను 2027 జనవరి 20 నుండి జనవరి 25 వరకు నిర్వహిస్తారు.

'ఆయనే మీ వీరాభిమాని.. అన్నీ చూసుకుంటారు'

కోమటిరెడ్డి, గడ్కరీ అనుబంధంపై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వేదికపై నవ్వులు పూయించిన సీఎం చమత్కారం



ముద్ర, హైదరాబాద్ : 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ ప్రారంభోత్సవ వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మధ్య ఆసక్తికరమైన సంభాషణ చోటుచేసుకుంది. తెలంగాణకు అవసరమైన కీలక రహదారి ప్రాజెక్టుల విషయంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, గడ్కరీ మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన చమత్కార వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. సదస్సులో ప్రసంగించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. తెలంగాణకు అవసరమైన రీజినల్ రింగ్ రోడ్డు, విజయవాడ జాతీయ రహదారి విస్తరణ, శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌తోపాటు సుమారు తొమ్మిది కీలక రహదారి ప్రాజెక్టులను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాలను ప్రస్తావిస్తూ గడ్కరీని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''నా సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మన రాష్ట్రానికి అవసరమైన ప్రాజెక్టుల పెద్ద జాబితానే మీకు అందించారు. నేను వాటిని మళ్లీ ప్రస్తావించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కోమటిరెడ్డి గారు మీ శ్రేయోభిలాషి, మీ అనుచరుడు, మీ వీరాభిమాని. ఆయనే అన్నీ చూసుకుంటారు. వాటి గురించి నేను పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు'' అని సీఎం వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి చేసిన ఈ చమత్కార వ్యాఖ్యలతో వేదికపై ఉన్న గడ్కరీతోపాటు సభికులు నవ్వుల్లో మునిగిపోయారు.

అంతకుముందు మాట్లాడిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కూడా గడ్కరీ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలను ప్రస్తావించారు. వారిద్దరి మధ్య మంచి పరిచయాలు ఉన్నాయని, ఆ అనుబంధంతో తెలంగాణకు భారీగా నిధులు, కీలక రహదారి ప్రాజెక్టులు మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తంగా 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వేదికపై అభివృద్ధి ప్రాజెక్టుల చర్చతోపాటు నేతల మధ్య ఆత్మీయ సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

తెలంగాణ రోడ్ల అభివృద్ధికి రూ.13,060 కోట్లు

తెలంగాణలో 6,092 కిలోమీటర్ల మేర 441 రోడ్ల అభివృద్ధికి రూ.13,060 కోట్లు ఖర్చు చేయనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి త్వరగా కేంద్ర కేబినెట్ ఆమోదం ఇవ్వాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు వెల్లడించారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించడంతో పాటు హైదరాబాద్–శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 2,144 కిలోమీటర్ల మేర 23 రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని, పాదచారులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

రాజ్యాంగ హక్కును విధ్వంసం చేస్తే ప్రజా పోరాటాలు తప్పవు

22న జరిగే ప్రజా సదస్సును విజయవంతం చేద్దాం
రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వేదిక పిలుపు



ముద్ర, హైదరాబాద్ : మార్పులు, చేర్పులు, కూర్పుల పేరుతో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును విధ్వంసం చేసే చర్యలకు పాల్పడితే సహించేది లేదని, ఓటు హక్కును కాపాడుకోడానికి ప్రజల పోరాటాలు తప్పవని రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వేదిక హెచ్చరించింది. ఈ అప్రజాస్వామిక చర్యలపై ప్రజలకు స్పష్టమైన అవగాహనా కల్పించేందుకే ప్రజా సదస్సును నిర్వహిస్తున్నట్లు వేదిక పేర్కొంది. "ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) – రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లు" అనే అంశంపై, ఈ నెల 22న ఖైరతాబాద్ లోని విశ్వేశ్వరయ్య భవన్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ప్రజా సదస్సుకు సంబంధించిన పోస్టర్ ను, కరపత్రాన్ని గురువారం నాడు బషీర్ బాగ్ లోని దేశోద్ధారక భవన్ లో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వేదిక(ఎఫ్.సి.డి) విడుదల చేసింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిక కన్వీనర్ డాక్టర్ కె. రామచంద్ర మూర్తి మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల విశ్వసనీయతపైనే ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు ఎన్నికలపై విశ్వసనీయత ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మహారాష్ట్రలో భారీ స్థాయిలో ఓటర్ల జాబితాలో వ్యత్యాసాలు ఉన్నట్లు వచ్చిన నివేదికలను ఆయన ప్రస్తావిస్తూ, ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలు, చర్యలు చూస్తుంటే అది ప్రభుత్వ జేబు సంస్థగా మారిందన్న అనుమానాలు కలుగుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మేధావులు, పౌర సమాజ సంస్థలు, యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 22న తమ వేదిక నిర్వహిస్తున్న ప్రజా సదస్సుకు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు.

సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఏకపక్షంగా సాగుతోందని, దాని చట్టబద్ధత, రాజ్యాంగబద్ధతపై పలు సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఓటర్ల మ్యాపింగ్ అవసరం ఎందుకు వచ్చిందని, ఇలాంటి నిబంధనలు రాజ్యాంగంలో లేదా చట్టంలో ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన లేని పరిస్థితుల్లోనే పౌరుల నుంచి ప్రకటనలు, ధ్రువీకరణలు కోరుతున్నట్లు ఆయన అన్నారు. అలాగే ఓటర్ల పేర్లను తొలగించేందుకు పెద్ద సంఖ్యలో ఫారం–7 దరఖాస్తులు సమర్పించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే వ్యక్తి వందలాది మంది ఓటర్లకు సంబంధించి దరఖాస్తులు సమర్పించినట్లు ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కేసులు నమోదైన విషయాన్ని ఆయన గుర్తుచేసారు. ఈ ప్రక్రియపై ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న తీరుపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, చొరబాటుదారుల విషయంలో ఎన్నికల సంఘం చేస్తున్న ప్రకటనలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ ప్రక్రియ ప్రజల్లో గతంలో ఎన్నడూ లేనంతగా ఆందోళనకు కారణమైందని, రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతోందని జస్టిస్ సుదర్శన్ రెడ్డి విచారం వ్యక్తం చేసారు.

శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, ఓటర్ల పేర్ల తొలగింపు, మార్పులకు సంబంధించిన అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో జరుగుతున్న అప్రజాస్వామిక చర్యలను దృష్టిలో ఉంచుకుని దీనిపై తీవ్రమైన ప్రజా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ లక్ష్యంతో సుమారు 50 మంది మేధావులు ఎఫ్.సి.డి వేదికగా ఒక్కటయ్యారని ఆయన తెలిపారు.

హైకోర్టు సీనియర్ న్యాయవాది జి. జ్యోతి కిరణ్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వేదిక ఏర్పాటైన తర్వాత, హైదరాబాద్ లో ఈ నెల 22న నిర్వహిస్తున్న తొలి బహిరంగ సదస్సును విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, దాని వల్ల ఎదురయ్యే పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పౌరులు, మేధావులు, పౌర సమాజ సంస్థలు, ప్రజాస్వామ్య హక్కుల కార్యకర్తలు ఈ సదస్సుకు హాజరై చర్చలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

ఈ విలేకరుల సమావేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వేదిక సభ్యులు కె.విరాహత్ అలీ, రహ్మాన్, కో–ఆర్డినేటర్ దీప్తి బత్తిని తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శుక్రవారం, 20 నవంబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

పసుపుతో ప్రయోజనాలు

చాలా మంది మహిళలు ఒకవైపు మొండి మొటిమలతో, మరోవైపు శారీరక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతుంటారు. ముఖ్యంగా, పనిభారం, ఒత్తిడి పెరిగినప్పుడు దవడల మీద వచ్చే మొటిమలు చాలా మందికి ఆందోళన కలిగిస్తుంటాయి. అదే సమయంలో, ఆరోగ్య పరీక్షలలో రక్తంలో చక్కెర స్థాయిలలో మార్పులు, ప్రారంభ దశలో ఉన్న ఫ్యాటీ లివర్ వ్యాధి కూడా బయటపడుతున్నాయి. దీని ఫలితంగా, మనం చర్మ కాంతి కోసం క్రీములను, జీవక్రియ ఆరోగ్యం కోసం ప్రత్యేక సప్లిమెంట్లను ఆశ్రయిస్తుంటాము. కానీ మన చర్మ ఆరోగ్యానికి, శరీర జీవక్రియ విధులకు మధ్య ఒక సంబంధం ఉండవచ్చని చాలా మందికి తెలియదు.



శరీరంలో దీర్ఘకాలికంగా ఉండే స్వల్పస్థాయి వాపు జీవక్రియ సమస్యలనే కాకుండా, చర్మ ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఇలాంటి నేపథ్యంలో, తరతరాలుగా మన వంటగదిలో వాడుతుంటున్న పసుపులోని కర్కుమిన్ అనే సహజ సమ్మేళనం, దాని యాంటీ-ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాల కారణంగా ఆధునిక వైద్య ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. పసుపు చర్మ ఆరోగ్యానికి, శరీర జీవక్రియకు ఎలా సహాయపడుతుంది? దీని వెనుక ఉన్న శాస్త్రం ఏమిటి? ఎస్.డి.ఎం ఆయుర్వేద కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్ ఆర్. పల్లాల్ వివరిస్తున్నారు. భారతీయ వంటగదిలో పసుపు లేని ఇల్లే ఉండదు. అయితే ఇది కేవలం వంటకు రంగు, రుచిని ఇవ్వడమే కాకుండా, మన ఆరోగ్యాన్ని, సౌందర్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఆయుర్వేద నిపుణుల ప్రకారం, పసుపులో ఉన్న ఔషధ గుణాలు మన శరీరంలోని అనేక సమస్యలకు పరిష్కారాన్ని అందిస్తాయి.

చర్మ ఆరోగ్యానికి పసుపు?

మన శరీరంలో కొన్ని హానికరమైన అణువులు అధికంగా వ్యక్తమైనప్పుడు మొటిమలు, చర్మం ఎర్రబడటం, చర్మం ముడతలు పడటం వంటి సమస్యలు వస్తాయి. పసుపులో ఉండే కర్కుమిన్ అనే శక్తివంతమైన గుణం ఈ చర్మ సమస్యలకూ, వాపులకూ కారణమయ్యే మార్గాలను అడ్డుకోవడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా, చర్మానికి హాని చేసే బ్యాక్టీరియాను నియంత్రించి, చర్మానికి సహజమైన కాంతిని, నిగనిగలాడే అందాన్ని ఇస్తుంది. కేవలం బాహ్య సౌందర్యమే కాకుండా, శరీర మెటబాలిజం మెరుగుపడటంలోనూ పసుపు అద్భుతంగా పని చేస్తుంది. మనం తీసుకునే ఆహారం సరిగ్గా జీర్ణమవ్వడానికి, శరీరంలో అనవసరమైన కొవ్వులు పేరుకుపోకుండా ఉండటానికి ఇది తోడ్పడుతుంది. సరైన పద్ధతిలో పసుపును ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నియంత్రించవచ్చు.

పసుపును వినియోగించే సరైన పద్ధతులు

మార్నింగ్ డ్రింక్:

ఒక కప్పు గోరువెచ్చని నీటిలో అర టీస్పూన్ అధిక కర్కుమిన్ గల సహజ పసుపు పొడి, చిటికెడు తాజాగా నూరిన నల్ల మిరియాల పొడి, అర టీస్పూన్ కరిగించిన A2 ఆవు నెయ్యి కలపండి. దీనిని ఉదయం పూట పరగడుపున తాగండి. నెయ్యి మీ పేగు గోడలను మృదువుగా చేస్తుంది, మిరియాలలోని పైపెరిన్ పసుపు నుండి పోషకాలను కణాలు గ్రహించడంలో సహాయపడుతుంది. కర్కుమిన్ ఆ రోజుకు ఇన్సులిన్ చర్యను నియంత్రిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది.

యాంటీ ఇన్ఫ్లమేటరీ ఉప్టాన్ ప్యాక్:

ఒక చెంచా శనగపిండిలో కొద్దిగా పసుపు, పాలు లేదా పెరుగు కలిపి ముఖానికి రాసుకుని, 10 నిమిషాల తర్వాత కడిగేయండి. పాలలోని లాక్టిక్ యాసిడ్ మృత కణాలను సున్నితంగా తొలగిస్తుంది. పసుపు చర్మంపై ఎరుపుదనాన్ని, వాపును తగ్గించి, చర్మం రక్షణ పొరను బలపరుస్తుంది.

భోజనం తర్వాత రక్తంలో చక్కెర నియంత్రణ:

మీ ఆహారంలో లేదా మజ్జిగలో చిటికెడు పసుపు, సుకుప్ పొడిని కలపండి. ఈ సాధారణ అలవాటు భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగడాన్ని నియంత్రిస్తుంది. ఇది పొత్తికడుపు ప్రాంతంలో కొవ్వు పేరుకుపోవడాన్ని, హార్మోన్ల మార్పుల వల్ల వచ్చే మొటిమలను నివారిస్తుంది. కాబట్టి, రసాయనాలు నిండిన కృత్రిమ ఉత్పత్తులకు బదులుగా, మన సాంప్రదాయ పసుపును సరైన పద్ధతిలో ఉపయోగించి సంపూర్ణ ఆరోగ్యాన్ని, అందమైన చర్మాన్ని సొంతం చేసుకుందాం!

ఈ టాబ్లెట్ల వాడకంపై కెన్యా ఆందోళన



మహిళల వ్యక్తిగత ఆరోగ్యానికి సంబంధించిన ఒక సలహా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే, ఇది ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలర్జీకి వాడే సెటిరిజిన్ మాత్రను మహిళలు తమ జననాంగాల్లో పెట్టుకుంటే యోని కండరాలు బిగుతుగా మారతాయని, లైంగిక చర్య సమయంలో ఆనందం పెరుగుతుందని సోషల్ మీడియాలో పోస్టులు వచ్చాయి. అయితే, ఈ విధంగా సెటిరిజిన్‌ను ఉపయోగించేందుకు ఎలాంటి అనుమతి లేదని, అలా వాడటం సురక్షితమా కాదా అనే విషయంపై ఎలాంటి పరీక్షలూ జరగలేదని నిపుణులు చెబుతున్నారు. మహిళలు తమ జననాంగాల్లో సెటిరిజిన్ మాత్రలు పెట్టుకోవద్దని కెన్యా ఫార్మాస్యూటికల్ సొసైటీ హెచ్చరించింది. సెటిరిజిన్ అనేది సాధారణంగా అలర్జీ సమస్యలకు వాడే మందు. తుమ్ములు, ముక్కు కారడం, కళ్లలో దురద, చర్మంపై దద్దుర్లు వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు దీన్ని ఉపయోగిస్తారు. ఈ మందును నోటి ద్వారా తీసుకోవడానికి మాత్రమే తయారు చేశారు.

వైరల్ ట్రెండ్ ఎలా మొదలైంది?

సెటిరిజిన్ వాడకానికి సంబంధించిన ఈ వారం ప్రారంభంలో టిక్‌టాక్‌లో పలు పోస్టులు వైరల్ కావడంతో చర్చ మొదలైంది. ఈ మాత్రను ఉపయోగించడం వల్ల మహిళల జననాంగాల్లో తేమ తగ్గుతుందని, తద్వారా లైంగిక చర్య సమయంలో బిగుతుగా అనిపిస్తుందని ఆ పోస్టుల్లో పేర్కొన్నారు. యాంటీహిస్టమిన్ మందుల ప్రభావంతో కొన్నిసార్లు శరీరంలో పొడిబారే లక్షణాలు కనిపిస్తాయి. అయితే, దీనివల్ల జననాంగాల్లోని కండరాలు బలపడవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. "సెటిరిజిన్ వాడితే బిగుతు వస్తుందనేది నిజం కాదు. దీనివల్ల ఘర్షణ పెరిగి అసౌకర్యం కలగవచ్చు. సున్నితమైన అంతర్గత భాగాలకు గాయాలయ్యే ప్రమాదం కూడా ఉంది" అని కెన్యా ఫార్మాస్యూటికల్ సొసైటీ (పీఏస్‌కే) తెలిపింది. "నోటి ద్వారా తీసుకునే మాత్రలను జననాంగాల్లో పెట్టుకోవడం సురక్షితం కాదు. సెటిరిజిన్ మాత్రలను మింగడానికి మాత్రమే తయారు చేశారు. వాటిలోని పదార్థాలను శరీరంలోని సున్నితమైన భాగాలపై ఉపయోగించడం వల్ల ఎలాంటి ప్రభావాలు ఉంటాయో పరీక్షించలేదు" అని పేర్కొంది.

వైరల్ ప్రచారంపై చర్చ

సోషల్ మీడియాలో ఈ ప్రచారం వైరల్ కావడంతో దీనిపై చర్చ మొదలైంది. కొందరు సోషల్ మీడియా యూజర్లు ఈ విధానాన్ని ప్రోత్సహిస్తుండగా, మరికొందరు ఇలా చేయడం ఎంతవరకు సురక్షితమని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, సెటిరిజిన్ ధర పెరిగినట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. ముఖ్యంగా రాజధాని నైరోబీలోని కొన్ని మెడికల్ షాపుల్లో ఈ మందుకు డిమాండ్ పెరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. కెన్యాలో ఫార్మసిస్టులకు ప్రాతినిధ్యం వహించే సంస్థ పీఏస్‌కే గురువారం విడుదల చేసిన ప్రకటనలో "సెటిరిజిన్ అలర్జీకి వాడే మందు. దీన్ని నోటి ద్వారా తీసుకోవాలి. ఇతర ప్రయోజనాల కోసం ఈ మందుకు అనుమతి లేదు. అలాంటి ఉపయోగాల కోసం ఎలాంటి పరీక్షలూ జరగలేదు. ముఖ్యంగా జననాంగాల్లో వాడేందుకు అసలు అనుమతి లేదు" అని స్పష్టం చేసింది. "ఇప్పటికే ఎవరైనా ఈ విధంగా ఉపయోగించి ఉంటే వెంటనే ఆపేయాలి. నొప్పి, రక్తస్రావం, మంట, దురద, అసాధారణ స్రావం లేదా జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి" అని సూచించింది. ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని పంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లకు కూడా పీఏస్‌కే సూచించింది. సరైన పరిశీలన లేకుండా చేసే ప్రచారాలు ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని పేర్కొంది.

ఆరోగ్య శాఖ ఆందోళన

ఈ వైరల్ ట్రెండ్‌పై కెన్యా ఆరోగ్య శాఖ ఆందోళన వ్యక్తం చేసిన ఒక రోజు తర్వాత, అక్కడి ఫార్మసిస్టుల సంఘం ఈ హెచ్చరికలు జారీ చేసింది. సోషల్ మీడియాలో కొందరు నిపుణుల వైద్య సూచనలను తేలిగ్గా తీసుకుంటున్నారని, దాని వల్ల ఎదురయ్యే పరిణామాలను పట్టించుకోవడం లేదని ఆరోగ్య శాఖలోని సీనియర్ అధికారి ఓమా ఒలుగా అన్నారు. మందుల అమ్మకాలు, కొనుగోళ్లపై నిఘా ఉంచేందుకు ఒక వ్యవస్థను ప్రారంభించే అంశాన్ని అధికారులు పరిశీలించవచ్చని ఆయన సూచించారు. దీంతో ఏయే మందులను దుర్వినియోగం చేస్తున్నారో గుర్తించడం సులభమవుతుందని చెప్పారు. అయితే, అలాంటి వ్యవస్థను ప్రారంభించడంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదు.

మందుల డిమాండ్‌పై ఆందోళన

సెటిరిజిన్‌కు డిమాండ్, ధర పెరుగుతున్నట్లు వస్తున్న వార్తలు తమ దృష్టికి వచ్చాయని పీఏస్‌కే తెలిపింది. కొన్ని మెడికల్ షాపుల్లో ఈ మందు కొరత ఏర్పడినట్లు కూడా వార్తలు వస్తున్నాయని పేర్కొంది. ఈ వైరల్ ట్రెండ్‌ను ఆసరాగా చేసుకుని లాభాలు పొందేందుకు ప్రయత్నించవద్దని మందుల విక్రేతలకు సూచించింది. ఇదే విధంగా డిమాండ్ పెరుగుతూ ఉంటే, నిజంగా అలర్జీ చికిత్స కోసం సెటిరిజిన్ అవసరమైన వారికి ఈ మందు దొరకడం కష్టమవుతుందని హెచ్చరించింది. దుర్వినియోగం అయ్యే అవకాశం ఉన్న మందులను ఉద్దేశపూర్వకంగా విక్రయించవద్దని తమ సభ్యులకు పీఏస్‌కే సూచించింది. ఏదైనా మందును దుర్వినియోగం చేయడం వల్ల ప్రతికూల ప్రభావాలు ఎదురైతే, ఆ విషయాన్ని ఆరోగ్య అధికారులకు తెలియజేయాలని కోరింది. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే నిర్ధరణ లేని చిట్కాల కంటే నిపుణుల సూచనలకే ప్రాధాన్యత ఇవ్వాలని పీఏస్‌కే తన ప్రకటన చివర్లో పేర్కొంది. "ఒక మందును దేని కోసం తయారు చేశారో కాకుండా, మరో ప్రయోజనం కోసం ఉపయోగించాలనుకుంటే ముందుగా ఫార్మసిస్టును సంప్రదించండి. వైద్య సలహాల కోసం సోషల్ మీడియాపై ఆధారపడవద్దు" అని సూచించింది.

పండిన అరటిపండుతో ప్రయోజనం

ఇంట్లో ఉన్న అరటిపండ్లు బాగా పండాయా? నల్లటి మచ్చలు వచ్చాయని వాటిని పారేస్తున్నారా? బాగా పండిన అరటిపండ్ల వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో తెలిస్తే మీరు ఆ పని చేయరు. పండిన అరటిపండ్ల గురించి డాక్టర్లు ఏమంటున్నారంటే?

మనలో చాలామంది మార్కెట్‌లో లేదా ఇంట్లో పైన డార్క్ బ్రౌన్ మచ్చలు ఉన్న అరటిపండ్లను చూడగానే అవి పండిపోయాయని, పండితే పాడైపోయాయని భావించి పడేస్తుంటారు. పైన ఎలాంటి మచ్చలు లేకుండా శుభ్రంగా ఉండే పండ్లనే తినడానికి ఇష్టపడతారు. కానీ, బయట చూడటానికి కాస్త నల్లగా, బ్రౌన్ మచ్చలతో, కాస్త పండినట్లు కనిపించే ఆ అరటిపండే నిజానికి మన ఆరోగ్యానికి 'సూపర్ ఫుడ్' అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఈ విషయం తెలిస్తే వదలరు!

బాగా పండిన, బ్రౌన్ మచ్చలున్న అరటిపండులో లాంటి ఆక్టివ్ కాంపౌండ్స్ లభిస్తాయి. ఇవి మన శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను విపరీతంగా బూస్ట్ చేయడానికి ఎంతగానో తోడ్పడతాయి. అరటిపండు ఎంతగా పండితే, దానిలోని యాంటీఆక్సిడెంట్ శక్తి అంతగా పెరుగుతుంది. ఇవి శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, కణాలను రక్షిస్తాయి.

ఆరోగ్యానికి ఉపయోగం

అరటిపండు బాగా పండే క్రమంలో అందులో ఉండే సంక్లిష్టమైన 'స్టార్చ్' కాస్త సులభంగా జీర్ణమయ్యే 'సహజమైన చక్కెర'గా మారుతుంది. పండిన అరటిపండులోని పోషక విలువలను మన శరీరం చాలా సులభంగా గ్రహిస్తుంది జీర్ణ వ్యవస్థపై భారం పడకుండా, శరీరానికి తక్షణ శక్తిని, ఆరోగ్య రక్షణను ఇది అందిస్తుంది.

ఎలా ఉపయోగించాలి?

పైన మచ్చలు వచ్చి బాగా మెత్తబడినంత మాత్రాన అరటిపండు పాడైపోయినట్లు కాదు. వీటిని నేరుగా తినడానికి ఇష్టపడకపోతే ..మిల్క్ షేక్‌లు లేదా స్మూతీలలో సహజమైన తీపి కోసం వాడవచ్చు. హెల్తీ బనానా పాన్‌కేక్స్, కేక్‌లు లేదా ఓట్స్ ఐటమ్స్ తయారీలో తీపి పదార్థాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చు. కాబట్టి, తదుపరిసారి డార్క్ బ్రౌన్ మచ్చలున్న అరటిపండు కనిపిస్తే అనవసరంగా చెత్తబుట్టలో పారేయకండి! అది మీ శరీరానికి ఒక హెల్త్ అప్‌గ్రేడ్ అని గుర్తించండి.





వందేళ్ల స్ఫూర్తి..
చదువుల చుక్క!

ముఖంపై చెరగని చిరునవ్వు.. ఒంటిపై తెల్లని ధోవతి.. మాటల్లో ఆప్యాయత.. ఆలోచనల్లో విశాలత్వం.. మనసులో కల్మషం లేని స్వచ్ఛత.. నడవడికలో నిరాడంబరత! ఎన్ని హోదాలు అలంకరించినా సామాన్యుడిగానే జీవించడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం. చేతిలో సుద్దముక్క పట్టి తరగతి గదిలో అక్షరాలు దిద్దించిన గురువు.. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన విద్యావేత్త.. నిరంకుశ పాలనను ఎదిరించి పోరాడిన ఉద్యమకారుడు.. ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యలపై గళమెత్తిన సామాజికవేత్త.. ఆయనే చుక్కా రామయ్య. ఒక వ్యక్తి ఇంటిపేరే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థకు గుర్తింపుగా మారడం అరుదైన విషయం. ఆ పేరే దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆశలకు, ఆకాంక్షలకు చిరునామాగా నిలవడం ఆయన సాధించిన అసాధారణ ఘనత. అందుకే ఆయన కేవలం ఓ ఉపాధ్యాయుడు కాదు.. ఓ విద్యా ఉద్యమానికి ప్రతిరూపం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే 'ఐఐటీ రామయ్య'.

పోరాటాల పురిటిగడ్డలో..

1925 నవంబరు 20న ఉమ్మడి వరంగల్ జిల్లా (ప్రస్తుత జనగామ జిల్లా) గూడూరులో జన్మించిన చుక్కా రామయ్యది పోరాటాల స్ఫూర్తితో నిండిన జీవితం. తెలంగాణలో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, భూమి–భుక్తి–విముక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాటంలో యువకుడిగానే పాల్గొన్నారు. నిజాం నిరంకుశత్వం, రజాకార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచి ఔరంగాబాద్ జైలులో నిర్బంధాన్ని అనుభవించారు. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంతోపాటు మలిదశ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారు. నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న వారిలో తానొకడినని, తనను సామాన్య పౌరుడిగానే గుర్తిస్తే చాలంటూ నిరాడంబరతను చాటుకున్నారు.

ఆలోచనలే ఆయుధంగా..

ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టిన ఆయన నిరంతర అధ్యయనం, జ్ఞాన తృష్ణతో అంచెలంచెలుగా ఎదిగి నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. యువతకు అవకాశాలు కల్పించాలనే ఆశయంతో పదవీ విరమణకు ఐదేళ్ల ముందే స్వచ్ఛందంగా ఉద్యోగం నుంచి వైదొలిగారు. ఆయన బోధనా పద్ధతి ప్రత్యేకం. క్లిష్టమైన గణిత, విజ్ఞాన శాస్త్ర అంశాలను సైతం నిత్యజీవిత ఉదాహరణలతో సులభంగా అర్థమయ్యేలా వివరించేవారు. విద్య అంటే మార్కులు, ర్యాంకులు సాధించడం మాత్రమే కాదని.. ప్రశ్నించే తత్వాన్ని, విశ్లేషణా శక్తిని పెంపొందించడమే అసలైన విద్య అని తన బోధనతో నిరూపించారు.



గడగోజు రవీంద్రాచారి
సీనియర్ జర్నలిస్టు
9848772232

ఇంటిపేరే ఐఐటీగా..

'ఐఐటీ రామయ్య'గా ఆయన ఎదుగుదల వెనుక ఓ ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. కుమార్తె ఐఐటీకి ఎంపికైన సందర్భంగా ప్రవేశ ప్రక్రియ కోసం వెళ్లినప్పుడు, అక్కడ హాజరైన వందలాది మంది తల్లిదండ్రుల్లో తెలుగు వారు వేళ్లపై లెక్కపెట్టేంత మంది మాత్రమే ఉండటం ఆయనను ఆలోచింపజేసింది. ప్రతిభ ఉన్న తెలుగు విద్యార్థులు సరైన మార్గదర్శకత్వం లేక వెనుకబడుతున్నారనే తపనతో ఐఐటీ శిక్షణ సంస్థను ప్రారంభించారు. విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు ఎంతగా సిద్ధమవుతారో, తానూ అంతే శ్రమించి ప్రతి ఏటా సన్నద్ధమయ్యేవారు. ఆర్థిక స్థోమత లేని గ్రామీణ, పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేశారు. ఒక వ్యక్తి ఇంటిపేరే ఐఐటీ శిక్షణకు పర్యాయపదంగా మారడం ఆయనకు దక్కిన అరుదైన గుర్తింపు.

పదవులకు అతీతంగా.. సామాజిక స్పృహ

పేద, దళిత, మైనారిటీ వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో పనిచేసిన ఆయన ఏ బాధ్యతలో ఉన్నా బోధనను విడిచిపెట్టలేదు. ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై శాసనమండలిలో విద్యారంగ సమస్యలపై గళమెత్తారు. సామాజిక అసమానతలను రూపుమాపడానికి విద్య ఒక్కటే సమర్థమైన ఆయుధమని విశ్వసించారు. విద్యావ్యవస్థ, బోధనా పద్ధతులు, సంక్షేమ విద్య, ప్రపంచీకరణ ప్రభావాలు తదితర అంశాలపై అనేక పుస్తకాలు రచించారు. తన అనుభవాలను, ఆలోచనలను అక్షరబద్ధం చేసి విద్యారంగ అభివృద్ధికి సూచనలు అందించారు.

తరాలకు తరగని స్ఫూర్తి..

సాయుధ పోరాటాల కాలం నుంచి సాంకేతిక విప్లవాల వరకు అనేక సామాజిక, రాజకీయ, విద్యా పరిణామాలకు సాక్షిగా నిలిచిన చుక్కా రామయ్య జీవితం ఒక అసాధారణ ప్రస్థానం. వందేళ్లు దాటిన ఆయన జీవితం నేటి తరానికి విలువైన పాఠం. విద్య వ్యాపారంగా మారుతున్న ప్రస్తుత తరుణంలోనూ చదువును సామాజిక బాధ్యతగా భావించి, ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదని ఆచరణలో చూపించారు. తెల్లని దుస్తుల వెనుక స్వచ్ఛమైన వ్యక్తిత్వం.. చిరునవ్వు వెనుక అపారమైన అనుభవం.. గురువు మనసులో సమాజం పట్ల అంతులేని బాధ్యత.. ఇవే ఆయన అసలైన ఆభరణాలు. ఇంటిపేరునే ఐఐటీగా నిలిపి, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగులు పంచిన ఈ చదువుల చుక్కకు అక్షర నీరాజనం!

(నేడు నవంబర్ 20వ తేదీన చుక్క రామయ్య శతజయంతి సందర్భంగా)



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 20.11.2026
www.mudranews.in | @mudranews

ముఖం కడుక్కోవడానికి ఏ నీరు మంచిది?



ముఖం కడుక్కోవడానికి మరీ వేడి లేదా మరీ చలటి నీటికి బదులుగా గోరువెచ్చని నీటిని ఉపయోగించడం మంచిది. అధిక వేడి నీరు చర్మంలోని సహజ నూనెలను తొలగించి పొడిబారేలా చేస్తుంది. కాబట్టి మితమైన ఉష్ణోగ్రత ఉన్న నీటినే ఉపయోగించాలి.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ అండ

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు సాగాలి
మహేందర్ రెడ్డి
ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 72,333 కొత్త పింఛన్లు మంజూరు



ముద్ర, మల్కాజిగిరి : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ఎలాంటి వివాదాలు, విమర్శలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సూచించారు.మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ సఖియా సుల్తానా తదితరులతో కలిసి మహేందర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తగా పింఛన్లు మంజూరైన 2,075 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం కొత్తగా 72,333 చేయూత పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు. మేడ్చల్ జిల్లాలో 25,552, రంగారెడ్డి జిల్లాలో 32,065, వికారాబాద్ జిల్లాలో 14,716 మందికి కొత్త పింఛన్లు మంజూరైనట్లు వివరించారు.మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో అల్వాల్‌లో 848 మందికి, మౌలాలిలో 1,048 మందికి, మల్కాజిగిరిలో 8,048 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందేలా కృషి చేస్తున్నారని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇంకా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు కానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన వారందరికీ దశలవారీగా పథకాలు అందుతాయని భరోసా ఇచ్చారు.

అర్హులందరికీ పథకాలు అందాలి:

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా సహకరిస్తామని తెలిపారు. ఇంకా ఎంతోమంది వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు అందాల్సి ఉందని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీష్ గౌడ్, ప్రేమ్ సాగర్, డిప్యూటీ కమిషనర్లు దశరథ్, సఖియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ఇందిరమ్మ ఆశయ సాధనే ఆమెకు నిజమైన నివాళి
పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
నెక్లెస్ రోడ్డులో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రులు



ముద్ర, హైదరాబాద్, నవంబర్ 19: భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఆమె విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్ రావు, మాజీ మంత్రులు దానం నాగేందర్, గీతారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉక్కు మహిళగా గుర్తింపు పొందిన ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె తీసుకున్న నిర్ణయాలు నేటికీ ప్రపంచంలోని పలువురు నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. దేశాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరా గాంధీ నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. పేదల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ 'గరీబీ హటావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేశారని తెలిపారు.దేశం కోసం జీవితాంతం శ్రమించిన ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగించడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రచించిన పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, అందులోని అంశాల ద్వారా ఇందిరా గాంధీ జీవితం, దేశానికి ఆమె చేసిన సేవలను మరింతగా తెలుసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

కూకట్‌పల్లిలో ..

ముద్ర, కూకట్‌పల్లి: భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ, భారతరత్న స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అల్లాపూర్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు వాజిద్ పాషా ఆధ్వర్యంలో, మూసాపేట్ విలేజ్ సమీపంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ఆధ్వర్యంలో, అలాగే ఐజీ పురంలో అజీజ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ.. దేశానికి ఇందిరాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యతతో పాటు పేద ప్రజల సంక్షేమం కోసం ఆమె తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయని పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, పేదరిక నిర్మూలన వంటి విప్లవాత్మక కార్యక్రమాల ద్వారా దేశాభివృద్ధికి ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు. ఇందిరాగాంధీ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాసేవలో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

రోగుల భద్రత, నాణ్యమైన వైద్య సేవలే ప్రధాన లక్ష్యం

డాక్టర్ బి. పార్థసారథి రెడ్డి
ఘనంగా వరల్డ్ క్వాలిటీ డే వేడుకలు



ముద్ర, హైదరాబాద్ : సింధు హాస్పిటల్స్‌లో వరల్డ్ క్వాలిటీ డే – 2026 వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. “క్వాలిటీ: పవరింగ్ పెర్ఫార్మెన్స్” (నాణ్యతే పనితీరుకు శక్తి) అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సేవల్లో నాణ్యత, రోగుల భద్రత, మెరుగైన వైద్య ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సాధించిన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అక్రిడిటేషన్, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ సర్టిఫికేషన్, నర్సింగ్ ఎక్సలెన్స్ విజయాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు, సింధు హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ బి. పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యత అనేది కేవలం సర్టిఫికేషన్లకే పరిమితం కాకూడదని, ప్రతి రోగికి అందించే వైద్య సేవల్లో అది స్పష్టంగా ప్రతిబింబించాలని అన్నారు. రోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వైద్య సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. సోమరాజు, డాక్టర్ ఎం. బాబయ్య, డాక్టర్ కె.వి.వి.ఎన్. రాజు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఆంటోనీ లాజర్ బాసిల్ తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా క్వాలిటీ ఆంథమ్, పేషెంట్ జర్నీ వీడియోను ఆవిష్కరించారు. ఆసుపత్రి తొలి క్వాలిటీ న్యూస్‌లెటర్‌ను విడుదల చేశారు. వైద్య సేవల్లో నాణ్యత పెంపొందించేందుకు వివిధ విభాగాల్లో విశేష కృషి చేసిన ఉద్యోగులు, బృందాలకు అవార్డులు అందజేసి సత్కరించారు. రోగులకు సురక్షితమైన వైద్యం అందించడం, మెరుగైన వైద్య ప్రమాణాలను పాటించడం, సేవల నాణ్యతను నిరంతరం అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా సింధు హాస్పిటల్స్ యాజమాన్యం పునరుద్ఘాటించింది.

పేదింటి ఆడబిడ్డలకు పెద్దన్నలా సీఎం రేవంత్ రెడ్డి



ముద్ర, కూకట్‌పల్లి: పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదింటి ఆడబిడ్డలకు పెద్దన్నలా నిలుస్తున్నారని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కొనియాడారు. కూకట్‌పల్లి మండలం పరిధిలోని వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, వెంకటేశ్వర నగర్ డివిజన్లకు చెందిన 83 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 83,09,628 (ఎనభై మూడు లక్షల తొమ్మిది వేల ఆరు వందల ఇరవై ఎనిమిది రూపాయలు) విలువైన కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాల ఆడబిడ్డల వివాహం సంతోషంగా జరగాలనే మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మువ్వల సవ్వడిలో కైలాస గాథ..

ఢిల్లీ వేదికపై ‘మహా గౌరి’
ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల నేతృత్వంలో తృష్ణ కూచిపూడి డాన్స్ అకాడమీ ప్రదర్శన




ముద్ర, న్యూఢిల్లీ : శివపార్వతుల దివ్య ప్రేమగాథకు కూచిపూడి నృత్యరూపం ప్రాణం పోసింది. పార్వతీదేవి తపస్సు, శివుడి విరహం, గౌరీ స్వరూప ఆవిర్భావ ఘట్టాలను ఆవిష్కరిస్తూ రూపొందించిన ‘మహా గౌరి’ నృత్యరూపకం గురువారం సాయంత్రం న్యూఢిల్లీలోని కమానీ ఆడిటోరియంలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల నేతృత్వంలో హైదరాబాద్‌కు చెందిన తృష్ణ కూచిపూడి డాన్స్ అకాడమీ ఈ ప్రదర్శనను సమర్పించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, నిజామాబాద్ లోక్‌సభ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌తో పాటు పలువురు ఎంపీలు, ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు.శివ మహాపురాణం, దేవీ భాగవతంలోని గౌరీ గాథ ఆధారంగా ఈ నృత్యరూపకాన్ని రూపొందించారు. పార్వతీదేవి కైలాసాన్ని వీడిన ఘట్టం నుంచి ఆమె కఠోర తపస్సు, ఆ తపస్సుకు మెచ్చిన బ్రహ్మదేవుడి అనుగ్రహంతో గౌరీ స్వరూపాన్ని పొందే వరకు కథను నృత్యాభినయం ద్వారా ప్రదర్శించారు. పార్వతి దృఢ సంకల్పం, శివుడి విరహ వేదన, మంగళగౌరీ ఆరాధనలో ప్రతిబింబించే శివపార్వతుల అనురాగాన్ని కళాకారులు అద్భుతమైన భావాభినయంతో ఆవిష్కరించారు. ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించగా, కరతాళధ్వనులతో కళాకారులను అభినందించారు.కూచిపూడి, భరతనాట్య శైలుల్లో దేశవిదేశాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చిన ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, కూచిపూడి అభినయంలో క్షేత్రయ్య పదాల ప్రాధాన్యంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. తెలుగు విశ్వవిద్యాలయంలో నృత్య విభాగాధిపతిగా, డీన్‌గా, తొలి మహిళా రిజిస్ట్రార్‌గా సేవలందించారు. కూచిపూడి రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా 2011లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారంతో పాటు హంస పురస్కారాన్ని అందుకున్నారు.అలేఖ్య పుంజాల 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో స్థాపించిన తృష్ణ కూచిపూడి డాన్స్ అకాడమీ ద్వారా ఇప్పటి వరకు వేలాది మంది యువ కళాకారులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ అందించారు. సంప్రదాయ నృత్యకళను భావితరాలకు అందించడంలో ఈ సంస్థ విశేష కృషి చేసోంది.

డిజిటల్ కల్లోలం..

శత్రువులు అవసరం లేదు.. సాంకేతిక లోపాలు చాలు అమెరికాలో బయటపడ్డ డిజిటల్ వ్యవస్థల బలహీనత
మైక్రోసాఫ్ట్, యాపిల్, బ్యాంకులు, విమాన సేవలకు ఆటంకం సైబర్ దాడుల ఆధారాల్లేవన్న అమెరికా విదేశాంగ మంత్రి
యూరప్‌లో సైబర్ దాడులతో పాడైన ఆహార పదార్థాలు

ముద్ర, వాషింగ్టన్, నవంబరు 18 : శత్రుదేశం సైబర్ దాడి చేయాల్సిన అవసరం లేదు.. ఒక్క సాంకేతిక లోపం చాలు.. ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేయడానికి. అమెరికాలో గత కొద్ది రోజులుగా వరుసగా చోటుచేసుకున్న సాంకేతిక అంతరాయాలు డిజిటల్ వ్యవస్థలపై ఆధారపడుతున్న ఆధునిక సమాజంలోని బలహీనతలను బయట పెట్టాయి. విమాన రాకపోకలు, బ్యాంకింగ్ సేవలు, మైక్రోసాఫ్ట్ వేదికలు, యాపిల్ సేవలు, ప్రభుత్వ సమాచార వ్యవస్థలు ఒక్కొక్కటిగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఈ ఘటనలన్నింటి వెనుక సమన్వయంతో కూడిన సైబర్ దాడి ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టంచేశారు. మైక్రోసాఫ్ట్ సేవల్లో తలెత్తిన సమస్యకు, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) వ్యవస్థలో వచ్చిన లోపానికి సంబంధం లేదని, బ్యాంకుల్లో సమస్యలు కూడా వేరని ఆయన తెలిపారు. ఇవన్నీ విడివిడిగా చోటుచేసుకున్న సాంకేతిక సమస్యలేనని చెప్పారు.

ఈ అంతరాయాలకు అమెరికాలోని పాత సాంకేతిక మౌలిక సదుపాయాలు ఒక కారణమై ఉండవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. పాత కంప్యూటర్ వ్యవస్థలకు కొత్త సాంకేతికతను జోడించే క్రమంలో సమస్యలు తలెత్తుతున్నాయని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ మంత్రి మార్క్వేన్ ముల్లిన్ పేర్కొన్నారు. మరిన్ని వ్యవస్థలను ఆధునికీకరించే సమయంలో ఇలాంటి అంతరాయాలు ఎదురయ్యే అవకాశం ఉన్నదని హెచ్చరించారు. ప్రస్తుతం



బ్యాంకులు, విమానయాన సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, వ్యాపార సంస్థలు ఒకదానితో మరొకటి అనుసంధానమైన డిజిటల్ సేవలపై ఆధారపడుతున్నాయి. బ్యాంకులు బయటి సాంకేతిక సేవల సంస్థలను వినియోగిస్తాయి. విమానయాన సంస్థలు షెడ్యూలింగ్, ప్రయాణికుల నిర్వహణకు డిజిటల్ వ్యవస్థలపై ఆధారపడుతాయి. ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉమ్మడి కమ్యూనికేషన్ వేదికలను ఉపయోగిస్తాయి. దీంతో ఒక సంస్థలో తలెత్తిన సమస్య ఇతర సంస్థల సేవలపైనా ప్రభావం చూపుతున్నది. మైక్రోసాఫ్ట్ సేవలు నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా వ్యాపార, ప్రభుత్వ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి.

ఏఐతో కొత్త సవాళ్లు

కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధి కూడా ఈ పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నది. సాఫ్ట్‌వేర్‌లోని భద్రతా లోపాలను ఏఐ సాధనాలు వేగంగా గుర్తించగలుగుతున్నాయి. దీంతో కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు వాటిని సరిచేసేందుకు సాఫ్ట్‌వేర్ ప్యాచ్లు, అప్‌డేట్లను త్వరితగతిన అమలు చేయాల్సి వస్తున్నది. అయితే తగిన పరీక్షలు లేకుండా అప్‌డేట్లను అమలు చేస్తే కొత్త సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నది. ఏఐ కారణంగానే తాజా అంతరాయాలు చోటుచేసుకున్నాయని చెప్పడానికి ఆధారాలు లేవు. కానీ సాంకేతిక మార్పుల వేగానికి అనుగుణంగా వాటిని పరీక్షించి, సురక్షితంగా అమలు చేసే సామర్థ్యం అన్ని సంస్థల్లో లేదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు యూరప్‌లో కొన్ని సూపర్ మార్కెట్ల శీతలీకరణ వ్యవస్థలపై సైబర్ దాడులు జరిగాయి. బెల్జియం, లక్సెంబర్గ్, స్వీడన్, ఐర్లాండ్‌లోని దుకాణాల్లో ఫ్రీజర్ల ఉష్ణోగ్రతలు పెరుగడంతో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను పారేయాల్సి వచ్చింది. ఫ్రాన్స్‌లో అక్టోబరులో జరిగిన మరో దాడిలో వందలాది సూపర్ మార్కెట్ల శీతలీకరణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు నివేదికలు తెలిపాయి. ఇవి అమెరికాలో చోటుచేసుకున్న సాంకేతిక లోపాల మాదిరి ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనలు కావు. ఉద్దేశపూర్వక సైబర్ దాడులుగా పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఆహార సరఫరా వంటి కీలక రంగాలు కూడా డిజిటల్ నియంత్రణ వ్యవస్థలపై ఎంతగా ఆధారపడుతున్నాయో ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 20.11.2026
www.mudranews.in | @mudranews

నీళ్లు తాగేటప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి



మరీ వేడి నీటిని తాగడం వల్ల నోరు, గొంతులో గాయాలు పర్వడవచ్చు. చల్లటి నీరు ఆరోగ్యవంతులకు సాధారణంగా హానికరం కాదు. నీటి ఉష్ణోగ్రత కంటే పరిశుభ్రమైన నీటిని తగినంతగా తాగడం ముఖ్యం. శరీర అవసరాలకు అనుగుణంగా నీటిని తీసుకోవాలి.

నార్సింగిలో అగ్నిప్రమాదం..

అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు

ముద్ర, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా నార్సింగి పరిధిలోని పసిఫికా హిల్ క్రెస్ట్ అపార్ట్ మెంట్ లో అగ్నిప్రమాదం జరిగింది. అపార్ట్ మెంట్ లోని బ్లాక్ వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అసలు అగ్నిప్రమాదానికి కారణాలు ఏమిటి?, ఆస్తి నష్టం ఎంత జరిగింది?, ఎవరైనా గాయపడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాగు బాగుతోనే సుభిక్షమైన తెలంగాణ

*** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**
*** పలువురు ప్రముఖులకు ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాల ప్రదానం..**
*** మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హయాంలో వ్యవసాయాభివృద్ధిపై పుస్తకావిష్కరణ**

ముద్ర, హైదరాబాద్: సాగు బాగుంటేనే సుభిక్షమైన తెలంగాణ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందించాలనేదే తమ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగంలో బహుముఖ సేవలు అందించిన ప్రముఖులకు ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన నివాసంలో గురువారం అందజేశారు. వ్యవసాయ రంగానికి సేవలు అందించిన శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, రైతులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఈ అవార్డులకు ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ ఎం.సుగుణాకర్ రెడ్డి, డాక్టర్ ఎస్.డి.శిఖామణి ((వ్యవసాయ శాస్త్రవేత్తలు), దిలీప్ రెడ్డి (పాత్రికేయుడు), లోనావత్ శాంతా బాయి (గిరిజన రైతు), కె.లావణ్య (సేంద్రియ రైతు) ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలు అందుకున్నారు. ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ వ్యవసాయాభివృద్ధికి అందించిన చేయూత, ఆ కాలంలో సాగు రంగంలో చోటు చేసుకున్న అభివృద్ధిపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు కె.వి.ఎన్.రెడ్డి, ఎం.భవాని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక శోభతో విరాజిల్లిన పాంబండ క్షేత్రం...

*** కన్నులపండువగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు..**



ముద్ర చిగురుమామిడి: కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకొని పాంబండ పంచముఖ ఆంజనేయ పీఠం ఆధ్వర్యంలోని శ్రీ స్వయంభు పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి పుణ్యక్షేత్రం భక్తజన సంద్రంగా మారింది.పీఠం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ పూజ్య గురు హామేష్ స్వామీజీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను అత్యంత శాస్త్రోక్తంగా, వైభవపేతంగా నిర్వహించారు.లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ వ్రతాలలో పాల్గొనేందుకు చిగురుమామిడి,హుస్నాబాద్, కోహెడ, సైదాపూర్, హుజురాబాద్ మండలాలతో పాటు కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ జిల్లాల నుండి దంపతులు, భక్తులు భారీ ఎత్తున విచ్చేశారు.వేదమంత్రోచ్చారణల మధ్య సాగిన ఈ పూజలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

నిరుద్యోగులకు మరో గుడ్‌న్యూస్..

ఆయుష్ విభాగంలో 70 ఉద్యోగాలు

ముద్ర, హైదరాబాద్: ఆయుష్ విభాగంలో 70 పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆయుర్వేద, హోమియోపతి, యునానీ విభాగాల్లో కలిపి మొత్తం 45 విభాగాలకు సంబంధించిన ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో లెక్చరర్లు, టెక్నికల్ అసిస్టెంట్ల పోస్టులు ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ 2, 2026లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

వైద్య రంగంలో నియామకాల జోరు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత మూడేళ్లలో ఆరోగ్యశాఖ పరిధిలో దాదాపు 15 వేల పోస్టులను భర్తీ చేసినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ఆయుష్ విభాగంలో ఇప్పటికే 137 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా భర్తీ చేశారు. వైద్య కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీల భర్తీపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి నిరంతర చర్యలు తీసుకుంటోంది. వైద్య సేవలను మరింత విస్తరించడంతో పాటు బోధనా సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఈ నియామకాలు దోహదపడనున్నాయి. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఆలస్యం చేయకుండా నిర్దిష్ట గడువులోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

పంజాగుట్టలో ఫుట్‌పాత్‌పై పసికందు మృతదేహం

ముద్ర, పంజాగుట్ట : నగరంలోని పంజాగుట్ట పోలీస్ ఠాణా పరిధిలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌పై నెలలు నిండని పసికందు మృతదేహం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి ఫుట్‌పాత్‌పై వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం, తదుపరి పరీక్షల నిమిత్తం శిశువు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరడా..

కరాచీ బేకరీ సహా పలు మాంస విక్రయ కేంద్రాలపై మెరుపు దాడులు



ముద్ర, హైదరాబాద్ : నగర ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఆహార తయారీ, విక్రయ సంస్థలపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 11 ప్రత్యేక బృందాలు 'క్యూర్' పరిధిలోని 15 మాంస విక్రయ, ప్రాసెసింగ్ యూనిట్లు 4 కరాచీ బేకరీ తయారీ కేంద్రాలపై ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించాయి.

అధికారులు తనిఖీలు చేపట్టిన వాటిలో ప్రముఖ రిటైల్ సంస్థ మెట్రో క్యాష్ అండ్ క్యారీ (గగన్‌పహాడ్, మూసాపేట్, సుచిత్ర ఎక్స్ రోడ్, ఉప్పల్ బ్రాంచ్‌లు), డిలైట్‌ఫుల్ గౌర్మెట్ ప్రైవేట్ లిమిటెడ్ – లిషియస్ (కిస్టాపూర్, మేడ్చల్), కరాచీ బేకరీ యూనిట్లు (శ్రీనగర్ కాలనీ, గగన్‌పహాడ్, ఎంజే మార్కెట్–గోషామహల్, మాదాపూర్), వతన్ ఫ్రెష్ మార్ట్, వతన్ ట్రేడర్స్ (ముషీరాబాద్), పంజాబ్ ఫిష్ కంపెనీ, ప్రోటీన్ ఫుడ్స్, హై ప్రోటీన్ (సికింద్రాబాద్), ఎస్ఎం సీ కార్పొరేషన్ (ఉప్పల్), ఏపీ ఫిషరీస్ (మల్కాజిగిరి) తదితర 19 సంస్థలు ఉన్నాయి.

తనిఖీల్లో వెలుగుచూసిన విస్తుపోయే నిజాలు

లైసెన్సులు లేకుండానే వ్యాపారం: పలు సంస్థలు కనీసం FSSAI లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ లేకుండానే కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

తీవ్ర అపరిశుభ్రత: నేలంతా రక్తం, మాంసం వ్యర్థాలతో నిండిపోయి ఉంది. డ్రైనేజీలు ఆహార వ్యర్థాలతో మూసుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. గోడలకు రక్తపు మరకలు, బూజు పట్టాయి.

కీటకాలు, ఎలుకల స్వైరవిహారం: ఆహార పదార్థాల తయారీ, నిల్వ కేంద్రాల్లో ఈగలు, బొద్దింకలతో పాటు బతికున్న ఎలుకలు తిరగడం, ఎలుకల రెట్టలు ఉండటాన్ని అధికారులు గుర్తించారు.

తప్పుడు లేబులింగ్: గడువు ముగిసిన ఆహార పదార్థాలను నిల్వ చేయడంతో పాటు, తయారీ తేదీలను మార్చి తప్పుడు లేబులింగ్‌తో విక్రయిస్తున్నట్లు తేలింది. ఉద్యోగుల ఆరోగ్య రికార్డులు, నీటి నాణ్యత నివేదికలు కూడా అందుబాటులో లేవు.

అధికారుల కఠిన చర్యలు:

ఈ దాడుల్లో సుమారు రూ. 6,59,213 విలువైన 1,672 కిలోల కల్తీ, గడువు ముగిసిన ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేసి ధ్వంసం చేశారు. FSSAI లైసెన్స్ లేకుండా, అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో నడుస్తున్న ఆనంద్ మటన్ అండ్ చికెన్ పాయింట్ (నల్లకుంట), సల్మాన్ కేజీఎన్ పౌల్ట్రీ (ఎర్రగడ్డ), న్యూ డీసెంట్ మీట్ చికెన్ అండ్ ఫిష్ షాప్ (ఎర్రగడ్డ), మెసర్స్ ప్రోటీన్ ఫుడ్స్ (ఎస్పీ రోడ్, సికింద్రాబాద్), మెసర్స్ ఏపీ ఫిషరీస్ ఫిష్ స్టాల్ (మల్కాజిగిరి) లను అధికారులు తక్షణమే మూసివేశారు.

అలాగే ఆరు సంస్థల లైసెన్సులు సస్పెండ్ చేసి తక్షణమే వ్యాపారం నిలిపివేతకు ఆదేశం ఇచ్చారు. కరాచీ బేకరీ పెర్ల్ ప్రైవేట్ లిమిటెడ్ (గగన్‌పహాడ్) రవాణా అనుమతి లేకుండానే మూడు వాహనాలను వాడటం, తయారీ, ప్యాకేజింగ్ ప్రాంతాల్లో తీవ్ర అపరిశుభ్రత, తుప్పు పట్టిన బేకింగ్ ట్రేలు, ఎలుకల రెట్టలు, ఈగలు ఉండటాన్ని గుర్తించారు. ముఖ్యంగా అక్టోబర్ నెలలో తయారైన ఆహార పదార్థాలపై నవంబర్ నెలలో తయారైనట్లు తప్పుడు లేబుల్స్ వేసి విక్రయిస్తుండటంతో రూ. 4,34,813 విలువైన 1,012 కిలోల ప్యాక్డ్ ఫుడ్‌ను సీజ్ చేశారు.

కరాచీ ఐఎన్‌సీ (శ్రీనగర్ కాలనీ)లో కేక్ సెక్షన్‌లోని ఫ్రిజ్‌లు అపరిశుభ్రంగా ఉండటం, కిచెన్‌లో ఆహార పదార్థాలతో పాటే క్లీనింగ్ కెమికల్స్ నిల్వ చేయడం, శాఖాహార, మాంసాహార పదార్థాలను ఒకే ఫ్రిజ్‌లో పెట్టడం, వండిన పచ్చి ఆహారాన్ని కలిపి ఉంచడం, బొద్దింకలు, ఈగల బెడద ఉండటంతో లైసెన్స్ సస్పెండ్ చేశారు. వతన్ ట్రేడర్స్ (జమిస్తాన్‌పూర్, ముషీరాబాద్)లో జంతు వధ తర్వాత మిగిలిన ఈకలు, తలలు, కాళ్లు వంటి వ్యర్థాలను అపరిశుభ్రంగా పడేయడం, పైకప్పు సరిగా లేక బూజు పట్టడం, నేలంతా రక్తపు మరకలు, ఈగల బెడద ఉండటంతో చర్యలు తీసుకున్నారు.

పంజాబ్ ఫిష్ కంపెనీ (సికింద్రాబాద్)లో చేపల నిల్వ కేంద్రంలో మురుగునీరు నిలిచిపోవడం, పైకప్పు పెచ్చులు ఊడి కింద ఉన్న ఫ్రిజ్‌లలో పడే ప్రమాదం ఉండటం, గడువు ముగిసిన ఫ్రోజన్ రొయ్యలు నిల్వ చేయడం, తుప్పు పట్టిన కత్తులు వాడటం వల్ల లైసెన్స్ రద్దు చేశారు. మెసర్స్ హై ప్రోటీన్ (ఎస్పీ రోడ్, సికింద్రాబాద్)లో గడువు ముగిసిన, లేబుల్ లేని ఆహార పదార్థాలు ఉండటం, చికెన్ కటింగ్ ఏరియాలో బతికున్న ఎలుకలు తిరగడం, ఫ్రీజర్‌లో చనిపోయిన ఈగలు కనిపించడంతో తక్షణమే మూసివేయాలని ఆదేశించారు.

ఎస్ఎం సీ కార్పొరేషన్ (ఉప్పల్)లో సరైన లైసెన్స్ కేటగిరీ లేకపోవడం, ఐస్ తయారీ యంత్రం వద్ద గోడ పెచ్చులు ఊడిపడటం, శుభ్రపరచని పరికరాలను వాడటం, ఈగల బెడద కారణంగా లైసెన్స్ సస్పెండ్ చేశారు. లోపాలను సరిదిద్దుకోవాలని వతన్ ఫ్రెష్ మార్ట్ (ముషీరాబాద్), మెట్రో క్యాష్ అండ్ క్యారీ (ఉప్పల్) సంస్థలకు 'ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు' జారీ చేశారు. అలాగే తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిన మెట్రో క్యాష్ అండ్ క్యారీ (గగన్‌పహాడ్, మూసాపేట్, సుచిత్ర), సాయిబాబా ఐఎన్‌సీ – కరాచీ బేకరీ (ఎంజే మార్కెట్), లిషియస్ (మేడ్చల్) సహా మూసివేసిన 5 సంస్థలకు (మొత్తం 10 సంస్థలకు) భారీ జరిమానాలు విధించేందుకు 'షోకాజ్ నోటీసులు' జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

రేవంత్ మాటల్లో విజన్ లేదు.. చేతల్లో విజన్ లేదు

- హరీశ్‌రావు

ముద్ర, హైదరాబాద్: సిద్దిపేట బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు స్పందించారు. రేవంత్‌రెడ్డి మాటల్లో విజన్ లేదు.. చేతల్లో విజన్ లేదని ఎద్దేవా చేశారు. ''సీఎం ప్రసంగంలో ప్రగల్భాలు తప్ప.. ప్రజల ఎజెండా లేదు. కరవు కోరల్లో నలుగుతున్న రైతుకు ఊరటనిచ్చే మాటల్లేవు. సిద్దిపేటకు నిలిపివేసిన రూ.1070 కోట్ల పెండింగ్ పనుల ప్రస్తావనే లేదు. ఊదరగొట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఊసేలేదు. పార్టీ మార్పు గురించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం. జిన్నా వచ్చి గాంధీ దేశభక్తిని ప్రశ్నించినట్లు ఉంది. శ్రీకాంత్‌చారి తల్లి శంకరమ్మకు కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఆమెను ఓడించింది కాంగ్రెస్ మంత్రివర్గంలోని ఉత్తమ్ కాదా? రేవంత్‌రెడ్డి బండ్ పెట్టిన కేసీఆర్ పథకాల లిస్ట్ చాంతాడంత ఉంది. ముత్యంరెడ్డి క్యాన్సర్ బారిన పడితే కేసీఆర్ అమెరికాకు పంపించారు'' అని హరీశ్‌రావు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

జగన్ కేసులో విచారణ

ముద్ర, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల కేసులను త్వరగా తేల్చాలంటూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. గతంలో ఈడీతో పాటు మాజీ ఎంపీ హరిరామజోగయ్య ఈ పిటిషన్లు దాఖలు చేశారు. 15 ఏళ్లుగా విచారణ కొనసాగుతోందని.. రోజువారీ విచారణ చేపట్టాలని 2024లోనే సుప్రీంకోర్టు ఆదేశించినా ఇప్పటి వరకు పురోగతి లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. జగన్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ హరిరామ జోగయ్య వ్యక్తిగత ఆసక్తితోనే ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారన్నారు. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు నవంబర్ 30కి వాయిదా వేసింది.

మంథని ఫోటోగ్రాఫర్‌కు అంతర్జాతీయ గుర్తింపు



ముద్ర, పెద్దపల్లి : మంథని పట్టణానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్, రవి వర్మ ఫోటో స్టూడియో యజమాని తూర్పాటి సత్యనారాయణకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. ఫ్రాన్స్, ఇటలీ, మొనాకో దేశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'రామోగే ఫోటో కాంటెస్ట్ 2026 – ది మ్యాన్ అండ్ ది సీ' పోటీలో ఆయన తీసిన ఫోటోకు ప్రత్యేక ప్రస్తావన లభించింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి వేలాది మంది ఫోటోగ్రాఫర్లు పంపిన ఫోటోలలో సత్యనారాయణ ఫోటో అంతర్జాతీయ జ్యూరీని ఆకట్టుకుంది. సముద్రంతో మనిషికి ఉన్న అనుబంధాన్ని, గిరిజన మహిళ జీవన విధానాన్ని ఆయన తన కెమెరాలో అద్భుతంగా బంధించారని నిర్వాహకులు ప్రశంసించారు. ఈ అవార్డు ప్రధానోత్సవం డిసెంబర్ 4న మొనాకోలోని ప్రపంచ ప్రసిద్ధ ఓషనోగ్రాఫిక్ మ్యూజియంలో జరగనుంది. ఈ వేడుకలో అంతర్జాతీయ జ్యూరీ సభ్యులు పాల్గొని విజేతలను సత్కరించనున్నారు. ఈ సందర్భంగా తూర్పాటి సత్యనారాయణ మాట్లాడుతూ... మంథని లాంటి చిన్న పట్టణం నుంచి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది తెలంగాణ ఫోటోగ్రాఫర్లందరికీ గర్వకారణమని అన్నారు. మంథని పట్టణ ప్రజలు, ఫోటోగ్రాఫర్లు, జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు సత్యనారాయణకు అభినందనలు తెలియజేశారు.

ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదు..

*** అడిషనల్ డీఆర్‌డీఏ విచారణలో తేటతెల్లం**
*** ముదిమాణిక్యం ఫీల్డ్ అసిస్టెంట్‌పై చేసినవి తప్పుడు ఆరోపణలేనని తేల్చిన కూలీలు**
*** వ్యక్తిగత భూ తగాదాలతో అధికారులను,కూలీలను ఇబ్బంది పెట్టడం సరికాదని హితవు**



ముద్ర చిగురుమామిడి: ముదిమాణిక్యం గ్రామంలో వి.బి.జి. రాంజీ (ఉపాధి హామీ) పథకం పనుల్లో ఎలాంటి బినామీ హాజరులు నమోదు కాలేదని,ఫీల్డ్ అసిస్టెంట్‌పై చేసిన ఆరోపణల్లో నిజం లేదని అడిషనల్ డీఆర్‌డీఏ కృష్ణ నిర్వహించిన విచారణలో తేలింది.గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పచ్చిమట్ల మధుసూదన్ గౌడ్ ఉపాధి హామీ పనుల్లో బినామీలకు హాజరు వేశారంటూ గారబోయిన బాలమల్లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ ఆరోపణలపై అడిషనల్ డీఆర్‌డీఏ కృష్ణ గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ తోపాటు ఫిర్యాదుదారుడు,ఫీల్డ్ అసిస్టెంట్,ఉపాధి హామీ కూలీల సమక్షంలో బహిరంగ విచారణ చేపట్టారు.ఈ విచారణలో భాగంగా మస్టర్లలో నమోదైన సుమారు 80మంది ఉపాధి హామీ కూలీలను అధికారి స్వయంగా విచారించారు. పనులకు హాజరైన వారికే హాజరు వేశారని,ఎలాంటి అక్రమాలు జరగలేదని కూలీలంతా ముక్తకంఠంతో స్పష్టం చేశారు.ఇరువురి మధ్య ఉన్న వ్యక్తిగత భూమి గెట్టు తగాదాలను మనసులో పెట్టుకుని బాలమల్లు ఈ తప్పుడు ఫిర్యాదు చేశారని వారు తెలిపారు.తమకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిత్యం పనులు కల్పిస్తూ అండగా నిలుస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ మధుసూదన్‌పై నిరాధార ఆరోపణలు చేయడంపై కూలీలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.వ్యక్తిగత కక్షలతో తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారుల సమయాన్ని వృథా చేయడం, కూలీలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఫిర్యాదుదారుడు బాలమల్లుకు అడిషనల్ డీఆర్‌డీఏ కృష్ణ హితవు పలికారు.భూమి పంచాయతీ విషయంలోనే ఈ ఫిర్యాదు చేయవలసి వచ్చిందని విచారణలో ఫిర్యాదుదారులు తెలిపారు.ఈ విచారణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని రమేష్,ఎంపీడీవో రామ్మోహన చారి,ఏపీవో రాజు, టీఏ శ్రీనివాస్, గ్రామ ప్రజలు,పెద్ద ఎత్తున ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 20.11.2026
www.mudranews.in | @mudranews

గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే ఉపశమనం



గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల శరీర అలసట తగ్గి విశ్రాంతి లభిస్తుంది. ముఖ్యంగా చల్లటి వాతావరణంలో వెచ్చని నీటితో స్నానం చేయడం సౌకర్యంగా ఉంటుంది. అయితే తలపై మరీ వేడి నీటిని పోయకూడదు.

మహిళలు ఆత్మవిశ్వాసం, స్థైర్యంతో విధులు నిర్వర్తించాలి

మహిళా ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సాధికారతపై దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక సదస్సు
రెండు రోజుల సెమినార్‌లో పాల్గొన్న 400 మంది మహిళా ఉద్యోగులు
ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే



ముద్ర, హైదరాబాద్, నవంబర్ 19 :రైల్వే ప్రగతిలో మహిళా ఉద్యోగుల పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు, వారి హక్కులు, విధులు, సంక్షేమంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక సదస్సును నిర్వహించింది. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో నవంబర్ 18, 19 తేదీల్లో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ సెమినార్ జరిగింది. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. మూడు డివిజన్లతో పాటు ప్రధాన కార్యాలయంలోని వాణిజ్య విభాగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, ముఖ్యంగా క్షేత్రస్థాయి సిబ్బందిని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతి పాండే మాట్లాడుతూ వాణిజ్య విభాగంలో వివిధ విజయాలు, నూతన మైలురాళ్ల సాధనలో మహిళా ఉద్యోగుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విధుల్లో ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా మహిళా ఉద్యోగులు ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పం, స్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. మహిళా ఉద్యోగులకు రాజ్యాంగం, రైల్వే నిబంధనల ప్రకారం లభించే హక్కులు, రక్షణలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా జన్ విశ్వాస్ చట్టం, కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక (పోష్) చట్టంలోని నిబంధనలను వివరించారు. విధులు, బాధ్యతలతో పాటు ఆరోగ్యకరమైన పని–వ్యక్తిగత జీవన సమతుల్యత ప్రాముఖ్యతను వివరించారు. బిజీ షెడ్యూల్‌లోనూ ఆరోగ్యం, శారీరక దృఢత్వం, స్వీయ సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే మహిళా ఉద్యోగులందరికీ పాల్గొనే అవకాశం కల్పించేందుకు రెండు రోజుల పాటు నాలుగు విడతల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు నిర్వహించారు. టికెట్ తనిఖీ సిబ్బంది, బుకింగ్ క్లర్కులు, పార్శిల్ క్లర్కులు, గూడ్స్ క్లర్కులు, వాణిజ్య తనిఖీ అధికారులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బందితో కలిపి మొత్తం 400 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. సదస్సులో నిర్వహించిన ముఖాముఖి చర్చల్లో మహిళా ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లను ప్రస్తావించారు. వారి సందేహాలకు ఇతి పాండే సమాధానాలిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వాణిజ్య విభాగాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అభినందించారు. మహిళా ఉద్యోగుల సంక్షేమం, భద్రత, సాధికారతకు దక్షిణ మధ్య రైల్వే కట్టుబడి ఉందని ఈ సదస్సు మరోసారి స్పష్టం చేసిందని ఆయన పేర్కొన్నారు.

ఎస్ఐఆర్ రివైజ్డ్ షెడ్యూల్ పకడ్బందీగా అమలు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్



ముద్ర ప్రతినిధి, మెదక్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను సవరించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ తెలిపారు.ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును నవంబర్ 18 నుంచి నవంబర్ 30 వరకు పొడిగించినట్లు వెల్లడించారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, సవరణలు, చిరునామా మార్పు వంటి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు తప్పనిసరిగా తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ఈనెల 18 – నవంబర్ 30 వరకు, నోటీసుల దశ, విచారణలు, క్లెయిమ్స్ – అభ్యంతరాల పరిష్కారం డిసెంబర్ 15 వరకు. తుది ఓటరు జాబితా ప్రచురణ డిసెంబర్ 22న ఉంటుందన్నారు. జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు సవరించిన షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో సవరించిన షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల భరోసా

తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేసేందుకు ముందుకు వచ్చిందని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రజా సంక్షేమ దార్శనికతతో ప్రజలకు మరింత భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందని, 18–59 సంవత్సరాల వయసు గల ఉపాధి పొందే కుటుంబ సభ్యులకు సంబంధించిన నిబంధనలు వర్తిస్తాయన్నారు. అవసరమైన పత్రాలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు, మొబైల్ నంబర్ ఉండాలని సూచించారు.

మెదక్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ

మెదక్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుండి టూరిజం కార్పొరేషన్ మెంబర్స్ శ్రీయారెడ్డి, యాదగిరిలు మెదక్ పర్యాటక ప్రాంతాలను సందర్శించిన అనంతరం కలెక్టర్ క్యాంపులో కలెక్టర్ తో మాట్లాడారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాలు పర్యాటక శోభ ఉట్టిపడేలా తుది మెరుగులు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈఓ ఎల్లయ్య, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, ఈడియం సందీప్, గైడ్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. గురువారం బొమ్మల రామారం మండలం చీకటి మామిడి గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి హేమలత, ఎంపీడీఓ శ్యామల, తహసీల్దార్ రాధ, ఎంపీఓ శశికళ, వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి, , గ్రామ సర్పంచ్ తిరుమల నాగరాజు, ఉప సర్పంచ్ జూపల్లి భూమయ్య, వార్డు సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం – ప్రతి కుటుంబానికి ₹5 లక్షల భరోసా!పథకం ముఖ్య వివరాలుబీమా మొత్తం: అర్హులైన ప్రతి కుటుంబానికి ₹5 లక్షల జీవిత బీమా రక్షణ.వయస్సు: 18–59 సంవత్సరాల వయసు గల ఉపాధి పొందే కుటుంబ సభ్యులకు సంబంధించిన నిబంధనలు వర్తిస్తాయి.ఎవరికి వర్తిస్తుంది? ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది.నామినీ: బీమా పొందే వ్యక్తి నామినీ వివరాలను నమోదు చేయించుకోవాలి.

ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి?

గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామస్థాయి అధికారులు, సంబంధిత ప్రత్యేక నమోదు కేంద్రాల్లో సంప్రదించాలి పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కార్యాలయం (లేదా) ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రత్యేక నమోదు కేంద్రాల్లో వివరాలు తెలుసుకోవాలి. ప్రభుత్వం ప్రకటించే నమోదు తేదీలు, అధికారిక మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి.అవసరమైన పత్రాలు1. ఆధార్ కార్డు2. రేషన్ కార్డు3. బీమా పొందే వ్యక్తి వివరాలు4. నామినీ వివరాలు5. మొబైల్ నంబర్అర్హులైన ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి!అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు చేసుకుని, ఈ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.ఒక కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచే రూ.5 లక్షల ఆర్థిక భరోసా – ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం.

జాతీయ సాహస శిబిరంలో ఎంజీయూ విద్యార్థులు



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో జరుగుతున్న జాతీయ సాహస శిబిరంలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ విద్యార్థిని విద్యార్థులు చురుకుగా పాల్గొంటున్నారు. రెండవ రోజు గురువారం కార్యక్రమంలో భాగంగా ఎత్తైన గుట్టలను తాడు సహాయంతో ఎలా ఎక్కాలో నేర్పించి విద్యార్థుల చేత చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని వారు ఇచ్చిన టాస్క్ ని కంప్లీట్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అడ్వెంచర్ క్యాంప్ కంటిజెంట్ లీడర్ కనక బాలరాజు వివిధ రాష్ట్రాలలోని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లింగసన్‌పల్లి తండాలో 'మాస్ గ్రౌండింగ్ ఆఫ్ మ్యాజిక్ సోక్‌పిట్స్'



ముద్ర ప్రతినిధి, మెదక్: హవేలీ ఘన్‌పూర్ మండలం లింగసన్‌పల్లి తండా గ్రామ పంచాయతీలో 'మాస్ గ్రౌండింగ్ ఆఫ్ మ్యాజిక్ సోక్‌పిట్స్' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం వల్ల గ్రామాలలో మురుగునీరు నిల్వ ఉండదని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు కూడా ఇవి ఎంతో దోహదపడతాయని పేర్కొంటూ, గ్రామస్తులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో కలిసి సోక్‌పిట్ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జెడ్.పి. సి.ఈ.ఓ ఎల్లయ్య, డి.ఆర్.డి.ఓ పిడి శ్రీనివాసరావు, డి.పి.ఓ యాదయ్య, ఎం.పి.డి.ఓ, సర్పంచ్ కే.శాంత బాబు, పంచాయతీ కార్యదర్శి, ఇతర మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ట్రాక్టర్ బోల్తా పడి ఒరిస్సా వలస కార్మికుడు మృతి





ముద్ర, మోటకొండూరు : యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఉన్న ఇటుక బట్టీల వద్ద ఘోర విషాదం చోటుచేసుకుంది. ఇటుక బట్టీ వద్ద పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 22 సంవత్సరాల వయసు గల ఒరిస్సా వాసి, కాటేపల్లి శివారులోని ఇటుక బట్టీ వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇటుకలు తయారు చేసే క్రమంలో గ్రిల్ ఉన్న ట్రాక్టర్‌తో ఎర్రమట్టిని తొక్కిస్తున్నాడు. ఈ సమయంలో అకస్మాత్తుగా ట్రాక్టర్ అదుపుతప్పి ఆ యువకుడు పైకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడు మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వలస వచ్చి పొట్టకూటి కోసం పనిచేస్తున్న యువకుడు ఇలా మృత్యువాత పడటంతో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఎన్టీఆర్ గార్డెన్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌ను పరిశీలించిన జితేష్ వి. పాటిల్

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్‌ను టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ, టీజీ రెడ్కో ఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఛార్జింగ్ స్టేషన్‌లో తమ వాహనాలను ఛార్జింగ్ చేసుకుంటున్న వినియోగదారులతో ఆయన నేరుగా మాట్లాడారు. ఛార్జింగ్ సదుపాయాలు, స్టేషన్ పనితీరు, వినియోగ సమయంలో ఎదురవుతున్న సమస్యలు, సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారుల నుంచి వచ్చిన సూచనలు, సమస్యలను పరిశీలిస్తూ ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల పనితీరును సమీక్షించారు.

పారిశుద్ధ్యకార్మికురాలిపై దాడి : సిఐటియు ఖండన



నల్గొండ, ముద్ర ప్రతినిధి: నల్గొండ పట్టణంలో విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికురాల పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి జిల్లా కార్యదర్శి ఎండి సలీం తెలిపారు గురువారం ఉదయం పారిశుధ్య కార్మికురాలు దాడి గురైనచందుపట్ల అరుణమ్మ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్గొండ పట్టణంలో అల్లరి మూకలు విధినిర్వహణలో ఉన్న మున్సిపల్ కార్మికులపై అక్రమంగా దాడి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు ఉదయం ఐదు గంటలకే విధులకు హాజరై తమ పనులను చేసుకుంటున్న క్రమంలో ఆ వీధిలో ఉన్న ఒక బాలకృష్ణ అనే స్థానికుడు అకారణంగా దాడి చేసి దౌర్జన్యంగా కర్రతో కొట్టడం జరిగిందని అన్నారు కార్మికులకు రక్షణ లేని పరిస్థితి ఏర్పడుతుందని మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు గతంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఉదారవాదంతో వదిలివేయడంతో మరింత దాడులు పెరుగుతున్నాయని అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు లకపాక రాజు దండంపల్లి సత్తయ్య పట్టణ కన్వీనర్ ఆటర్ రవీందర్ జిల్లా కమిటీ సభ్యులు భీమగాని గణేష్ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గాదె నర్సింహ యూనియన్ అధ్యక్ష కార్యదర్శి సంతోష్ కుమార్ పెరిక కృష్ణ లింగయ్య శ్రీను అమృతమ్మ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు

ఇండోర్ స్టేడియంకు 8 టేబుల్ టెన్నిస్ యూనిట్ల మంజూరు

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ పట్టణంలోని పి.ఎన్.ఆర్ ఇండోర్ స్టేడియం కోసం 8 టేబుల్ టెన్నిస్ యూనిట్లు మంజూరయ్యాయి. కొనుగోలు చేయడానికి రూ. 7.91 లక్షల రూపాయలు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే దా. మైనంపల్లి రోహిత్ తెలిపారు. స్టేడియంకి టేబుల్ టెన్నిస్ యూనిట్ల మంజూరు పట్ల మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. యూనిట్ల మంజూరు పట్ల క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, వాణి ప్రసాద్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 20.11.2026
www.mudranews.in | @mudranews

ఉదయం లేవగానే గోరువెచ్చని నీరు తాగండి

ఉదయం నిద్రలేవగానే నీళ్లు తాగే అలవాటును ఆయుర్వేదంలో 'ఉషాపానం' అంటారు. గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి తేమ అందడంతో పాటు కొందరిలో మలబద్ధకం సమస్య తగ్గి మల విసర్జన సులభంగా జరుగుతుంది.



హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి

మరిన్ని ఫ్లైఓవర్లు మంజూరు చేయండి





ఈటల రాజేందర్

బాలానగర్, కూకట్‌పల్లి, తుర్కయంజాల్–సాగర్ రోడ్డులో ఫ్లైఓవర్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి

ట్రిపుల్ ఆర్‌కు త్వరగా అనుమతులు మంజూరు చేయాలి

తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం సహకారం మరువలేనిది

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నిర్ణయాలు, పనితీరుపై ప్రశంసలు

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మరిన్ని ఫ్లైఓవర్లు మంజూరు చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు.హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (IRC) సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొంపల్లి, ఎల్బీనగర్, ఆరంఘర్ ఫ్లైఓవర్లను మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. బాలానగర్, కూకట్‌పల్లి, తుర్కయంజాల్–సాగర్ రోడ్డులో కూడా ఫ్లైఓవర్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రతిపాదనలను ఇప్పటికే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తాను కేంద్ర మంత్రికి అందజేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధికి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కేంద్రం పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.నితిన్ గడ్కరీ వేగంగా నిర్ణయాలు తీసుకునే నాయకుడని, ఆయన ప్రజలకు అందుబాటులో ఉండే ప్రో–యాక్టివ్, పాజిటివ్ మంత్రిగా గుర్తింపు పొందారని ఈటల ప్రశంసించారు. పార్లమెంట్‌లో ఏ పార్టీకి చెందిన సభ్యుడు రహదారులపై ప్రశ్నించినా గడ్కరీ ఇచ్చే సమాధానాలు సంతృప్తికరంగా ఉంటాయని పేర్కొన్నారు.తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణం, సెంట్రల్ రోడ్ ఫండ్స్ కేటాయింపుల్లో కేంద్రం అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా త్వరగా అనుమతులు మంజూరు చేస్తే నగర అభివృద్ధికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రైల్వేలు, విమానాశ్రయాలు, రహదారుల అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఈటల పేర్కొన్నారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాభివృద్ధి ఉందని విశ్వసించే నాయకత్వం కేంద్రంలో ఉందన్నారు.85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశానికి హైదరాబాద్ వేదిక కావడం గర్వకారణమని పేర్కొంటూ, తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సహకారం కొనసాగించాలని ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

గల్ఫ్‌పై ఇరాన్ దాడులు ఉధృతం

కువైట్, బహ్రెయిన్‌లో అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యం

ముద్ర, కైరో, నవంబర్ 18 : పశ్చిమాసియా మళ్లీ రాజుకుంటున్నది. అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధమేఘాలు అలుముకుంటున్నాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ బుధవారం తన పొరుగు గల్ఫ్ దేశాలపై దాడులను విస్తరించింది. కువైట్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై కాల్పులు జరిపిన ఇరాన్, బహ్రెయిన్‌పై పలుమార్లు దాడులు చేసింది. డ్రోన్ దాడులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని కువైట్ సైన్యం తెలిపింది. దేశ భద్రత, స్థిరత్వానికి ముప్పుగా మారిన ఇరాన్ దాడులను 'నేరపూరిత చర్యలు'గా కువైట్ విదేశాంగ శాఖ విమర్శించింది.కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరంపై బుధవారం తెల్లవారుజామున ఇరాన్ దాడి చేసింది.

ఈ దాడిలో, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్, క్షిపణి ప్రయోగ వేదికలను ఇరాన్ సైన్యం లక్ష్యంగా చేసుకున్నట్టు ఆ దేశ ప్రభుత్వ ప్రసార సంస్థ వెల్లడించింది. దాదాపు రెండు నెలల విరామం తర్వాత, ఇటీవల కొద్ది రోజులుగా బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలనే ఇరాన్ పదేపదే లక్ష్యంగా చేసుకుంటున్నది. పర్షియన్ గల్ఫ్‌లోని చిన్న ద్వీప రాజ్యమైన బహ్రెయిన్‌లో అమెరికాకు చెందిన 5వ నౌకాదళం ఉంది. హోర్ముజ్ జలసంధిలోని ఖేష్మ్ ద్వీపంలో రివల్యూషనరీ గార్డ్ క్షిపణి ప్రయోగ కేంద్రంపై అమెరికా యుద్ధ విమానం మంగళవారం దాడి చేసిన తర్వాతే ఈ దాడులు జరిగాయి. అంతకుముందు బహ్రెయిన్‌లోని అమెరికా రాడార్ కేంద్రంపై ఇరాన్ దాడి చేయడంతో, ప్రతీకారంగానే అమెరికా దాడి చేసిందని అధికారులు తెలిపారు.

కాలం చెల్లిన క్షిపణులతో అమెరికా దాడులు

ఇరాన్‌తో యుద్ధంలో గడువు ముగిసిన తొమహాక్ క్రూయిజ్ క్షిపణులు సహా వినియోగానికి పనికిరానివిగా గుర్తించిన మందుగుండు సామగ్రిని అమెరికా నావికా దళం వాడినట్టు నావికా దళం తాత్కాలిక కార్యదర్శి హంగ్ కావో వెల్లడించారు. కావో తన నియామక ఆమోద విచారణ కోసం ఈ నెల 17న సెనేట్ సాయుధ సేవల కమిటీ ఎదుట హాజరై, ఈ వివరాలను తెలిపారు. దీంతో అమెరికా ఆయుధ నిల్వల పరిస్థితి, కచ్చితమైన దాడులకు ఉపయోగించే క్షిపణుల కొరత పెరుగుతుండటం, పాత క్షిపణులపై ఆధారపడటంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. గడువు ముగిసినవిగా లేదా వినియోగానికి పనికిరానివిగా వర్గీకరించిన మందుగుండు సామగ్రిని నావికా దళం తీసుకుని, వాటి ఆపరేషన్ కోడ్‌లను మార్చి మళ్లీ వాడిందని కావో తెలిపారు.



ఈ ఏడాది ప్రారంభమైన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో వీటిని వినియోగించినట్టు చెప్పారు. ఇరాన్‌తో యుద్ధంలో మొదటి నాలుగు వారాల్లో అమెరికా సైన్యం 850కు పైగా తొమహాక్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించిందని మీడియా పేర్కొంది. యుద్ధ చర్యలకు విరామం ఇచ్చిన నాటికి వెయ్యికి పైగా క్షిపణులు ఖర్చయ్యాయని ఏప్రిల్ 21న సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ అంచనా వేసింది. తొమహాక్‌లు ఖరీదైనవి (ఒక్కో క్షిపణి ధర 3.6 మిలియన్ డాలర్ల వరకు) కావడం, తయారీకి చాలా సమయం పట్టడం వల్ల ఈ వినియోగ స్థాయి ఆందోళన కలిగిస్తున్నదని పరిశీలకులు చెప్తున్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కంపెనీలు ముందుకు రావాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

టాస్క్ సెంటర్ ద్వారా శిక్షణ అందించి యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు

ఫాక్స్‌కాన్ సంస్థ ద్వారా ఇప్పటికే 300 మంది జిల్లా యువతకు ఉపాధి

మహిళలకు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు

కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ

ముద్ర, పెద్దపల్లి : జిల్లాలోని స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించి, జిల్లాలోనే మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కంపెనీల ప్రతినిధులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై సంబంధిత కంపెనీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, టాస్క్ (TASK) సెంటర్ ద్వారా యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులు యువతకు అవసరమైన శిక్షణ అందించి, పెద్దపల్లి జిల్లాకు చెందిన దాదాపు 300 మంది యువతీ యువకులకు ఇప్పటికే ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. ఇదే తరహాలో ఇతర కంపెనీలు కూడా జిల్లాలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు.వైఎస్‌కే, బారా బారి, హెడ్ హెల్డ్ ప్రతినిధులు జిల్లాలోని యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేలా అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. ఆయా కంపెనీల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో నియమించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.స్థానిక యువతకు జిల్లాలోనే ఎక్కువ ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలని, ఇందుకోసం కంపెనీల ప్రతినిధులు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు.మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. మహిళలు ఇంటి నుంచే పని చేసుకునేందుకు అనువుగా ఉండే వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాలు, కార్యాచరణ, కార్యక్రమాలను రూపొందించాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు. తద్వారా మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే ఆర్థికంగా స్వావలంబన సాధించే అవకాశాలు కల్పించాలని తెలిపారు.జిల్లాలోని యువతకు నైపుణ్య శిక్షణ, స్థానిక ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించేలా సంబంధిత కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనా అధికారి రాజశేఖర్, టాస్క్ రీజినల్ సెంటర్ ఇన్‌చార్జి కౌసల్య, ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధి కౌశిక్, వైఎస్‌కే కంపెనీ ప్రతినిధులు, బారా బారి, హెడ్ హెల్డ్ కంపెనీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1, 2, 3 ఆధ్వర్యంలో 'జాతీయ సమైక్యతా దినోత్సవం' (నేషనల్ ఇంటిగ్రేషన్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్ విద్యార్థుల చేత జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు తోటకూరి రామకృష్ణ, ఎండి అత్తర్ ఫరీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ భేటీ

ప్రపంచ దేశాల్లో ఉత్కంఠ



ముద్ర, షెన్‌జన్ : ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకోబోతున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ నవంబర్ 19న తొలిసారిగా త్రైపాక్షిక సమావేశంలో పాల్గొననున్నారు. షెన్‌జెన్‌లో జరుగుతున్న అపెక్ సదస్సు దీనికి వేదిక కానుంది. ఇప్పటికే జిన్‌పింగ్, పుతిన్ సమావేశమై, తమ దేశాల సంబంధాలను పాత మిత్రుల బంధంగా అభివర్ణించారు.అంతర్జాతీయ అనిశ్చితి వేళ ఈ బంధం స్థిరత్వానికి దోహదపడుతుందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ట్రంప్, జిన్‌పింగ్ భేటీలో వాణిజ్య వివాదాలు, సుంకాలు, అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, అరుదైన ఖనిజాల సరఫరా, ఏఐ చిప్‌లపై ఆంక్షలు చర్చకు రానున్నాయి. ముగ్గురి సమావేశంలో అణ్వాయుధాల నియంత్రణ, ఇరాన్ యుద్ధం, అంతర్జాతీయ భద్రతపై చర్చించనున్నారు. ఉక్రెయిన్ యుద్ధం చర్చకు వస్తుందా లేదా అనేదానిపై స్పష్టత లేదు.

ట్రంప్‌నకు జిన్‌పింగ్ ఆలింగనం!

అపెక్ సదస్సుకు హాజరయ్యేందుకు బుధవారం చైనాలోని షెంజెన్‌కు వచ్చిన ట్రంప్‌కు ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో ట్రంప్‌నకు జిన్‌పింగ్ స్వయంగా స్వాగతం పలికారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు.


మళ్లీ భగ్గుమంటున్న బంగ్లాదేశ్

ముద్ర, ఢాకా : పదవీచ్యుతురాలైన మాజీ ప్రధాని షేక్ హసీనా దేశానికి వస్తారని ప్రచారం జరుగుతున్న క్రమంలో బంగ్లాదేశ్‌లో తిరిగి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడి పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. గత కొన్ని రోజులుగా అక్కడ నిరసనలు, ఘర్షణలు, బాంబు పేలుళ్లు, దహన దాడులు జరిగాయి. వీటికి హసీనా పార్టీకి చెందిన నిషేధిత అవామీ లీగ్ పార్టీ మద్దతుదారులే కారణమంటూ పోలీసులు ఆరోపిస్తున్నారు.

నెతన్యాహుకు పార్లమెంట్‌లో ఎదురుదెబ్బ

ముద్ర, ఇజ్రాయెల్ : ఇజ్రాయెల్ తాత్కాలిక ప్రధాని నెతన్యాహుకు పార్లమెంట్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ప్రత్యర్థి, మాజీ సైనికాధికారి గాడి ఐసెన్‌కోట్‌కు మద్దతుదారుడైన మతన్ కహానా పార్లమెంట్ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. మొత్తం 120 మంది సభ్యులకు గానూ 66 మంది ఆయనకు మద్దతివ్వగా, నెతన్యాహు లికుడ్ పార్టీ అభ్యర్థి ఒఫిర్ కాట్జ్‌కు 52 ఓట్లు వచ్చాయి. దీంతో నెతన్యాహు విధానాలను అడ్డుకునే అవకాశం ఐసెన్‌కోట్ వర్గానికి లభించింది.

ట్రంప్ హత్యకు కుట్ర పన్నిన వ్యక్తికి 27 ఏండ్ల జైలు





ముద్ర, వాషింగ్టన్ : డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు కుట్ర పన్నిన పాకిస్తాన్ పౌరుడు ఆసిఫ్ మర్చంట్ ఆసిఫ్‌కు 27 ఏండ్ల ఆరు నెలల జైలు శిక్ష పడింది. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టు ఈ తీర్పు చెప్పింది. ఆసిఫ్ ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) ట్రంప్, ఇతర అమెరికన్ నేతల హత్య చేసే పనిని తనకు అప్పగించినట్టు ఆసిఫ్ వాంగ్మూలం ఇచ్చాడు.

పెద్దపల్లికి మరో రెండు నూతన సింగిల్ విండో సొసైటీలు

ప్రభుత్వ విప్ విజయరమణారావు కృషి ఫలితం

రైతులకు మరింత చేరువలో సహకార సేవలు



ముద్ర, పెద్దపల్లి: రైతులకు సహకార సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను విస్తరించాలనే లక్ష్యంతో నియోజకవర్గంలో మరో రెండు నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సింగిల్ విండో సొసైటీలు) ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేసిన కృషి ఫలితంగా ఈ నిర్ణయం కార్యరూపం దాల్చింది.ఓదెల మండలంలోని పొత్కపల్లి సింగిల్ విండో సొసైటీ పరిధి నుంచి కొలనూరు నూతన సొసైటీగా ఏర్పడగా, పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట, పెద్దపల్లి సింగిల్ విండో సొసైటీల పరిధి నుంచి తుర్కలమద్దికుంట నూతన సొసైటీగా ఏర్పాటైంది.తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మెమో నంబర్ 8983 ద్వారా నూతన సింగిల్ విండో సొసైటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ విప్ విజయరమణారావు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర సహకార సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ఈ సొసైటీలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల అవసరాలను గుర్తించి సహకార వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నూతన సొసైటీల ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు కు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.నూతన సొసైటీల ఏర్పాటుతో తమ ప్రాంత రైతులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ దిశగా కృషి చేసిన ప్రభుత్వ విప్ విజయరమణారావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555